


# పోరు తెలంగాణ

డిజిటల్ తెలుగు దినపత్రిక




కరీంనగర్ సంపుటి : 11 సంచిక : 322 మంగళవారం 06-10-2026 ఎడిటర్ : కొండ ప్రవీణ్ కుమార్ పేజీలు : 04 వెల : 04

## భూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత




- ప్రజలకు రెవెన్యూ సేవలు మరింత సులభతరం చేయాలి
- అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రయోజనం అందించాలి
- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ప్రజలకు సంబంధించిన భూ సమస్యలను సుదీర్ఘకాలం పెండింగ్‌లో ఉంచకుండా, - మిగతా 2 లో

# సీఎం రేవంత్, నటిపై అసభ్య పోస్టులు

- సీఎం రేవంత్, నటి సురేఖావాణిపై అసభ్యకర పోస్ట్
- 'డిగ్‌టీవీ తెలుగు' ప్యారడీ ఎక్స్ ఖాతాపై కేసు
- సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నేత
- సీఎం ప్రతిష్ఠకు, నటి గౌరవానికి భంగం కలిగించేలా పోస్ట్
- కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు



## కష్టమైన దశ దాటేశారు.. ఎస్ఎల్‌బీసీ పనుల్లో ఇక దూకుడే!



- ఎస్ఎల్‌బీసీ పనుల్లో కీలక ముందడుగు
- క్లిష్టమైన షియర్ జోన్‌ను అధిగమించిన కార్మికులు
- సొరంగం పనులు 79 శాతం పూర్తి
- ఐదు నెలల్లో 700 మీటర్ల తవ్వకాలు
- 2028 జూన్ నాటికి నీటి విడుదల లక్ష్యం

ఎస్ఎల్‌బీసీ సొరంగం పనుల్లో కీలక ముందడుగు పడింది. తవ్వకాలకు తీవ్ర ఆటంకంగా మారిన క్లిష్టమైన భౌగోళిక ప్రాంతాన్ని - మిగతా 2 లో

## ఫ్యూచర్ సిటీలో విదేశీ వర్సిటీల క్యాంపస్‌లు



- ప్రత్యేక పాలసీకి తెలంగాణ సర్కార్ ప్లాన్
- అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థల ఏర్పాటుకు తెలంగాణ కీలక చర్యలు
- ఫ్యూచర్ సిటీలో ప్రముఖ విదేశీ యూనివర్సిటీల క్యాంపస్‌లు ఏర్పాటుకు ప్రత్యేక పాలసీ
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాలు
- అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి
- అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచన
- 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్'పైనా సమీక్ష

తెలంగాణలో అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థలను ఏర్పాటు - మిగతా 2 లో

# దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న "నేహా బోరా"

### ఆమె విద్యార్థి రాజకీయ ప్రయాణం ఎందుకు అంత ప్రత్యేకం



29 ఏళ్ల నేహా బోరా ఉత్తరాఖండ్‌కు చెందిన యువ విద్యార్థి నాయకురాలు. ఆమె తండ్రి భారతీయ సైన్యంలో అత్యున్నత హోదాలో (ఆర్మీలో ఉన్నత అధికారిగా) దేశానికి సేవ చేసిన వ్యక్తి. మిలిటరీ నేపథ్యం, నుంచి వచ్చినప్పటికీ సమాజంలోని అసమానతలను, ప్రభుత్వాల వైఫల్యాలను ప్రశ్నించే దృక్పథాన్ని నేహా ఎంచుకున్నారు. ఢిల్లీ యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ యూనివర్సిటీలో మాస్టర్స్ పూర్తి చేచేశారు. ప్రస్తుతం జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జీచీఖ)లో థియేటర్ అండ్ పెర్ఫార్మెన్స్ విభాగంలో ౢాష్ట్రణ రీసెర్చ్ స్కాలర్‌గా కొనసాగుతున్నారు. విద్యార్థి దశలోనే థియేటర్ ద్వారా సామాజిక సమస్యలపై గళం ఎత్తిన ఆమెకు, ఒక పొలిటికల్ థియేటర్ గ్రూప్ ద్వారా వామపక్ష ఞాxఙూాతో పరిచయం ఏర్పడింది. అక్కడి నుంచి విద్యార్థి రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ఆమె, 2019లో జూూా వ్యతిరేక ఉద్యమాల్లోనూ క్రియాశీలకంగా పాల్గొన్నారు. దేశాన్ని కుదిపేస్తున్న పేపర్ లీకులు, పరీక్షల పారదర్శకత లోపాలు, తీవ్రమైన నిరుద్యోగం , విద్యా వ్యవస్థ వైఫల్యాలపై ఆమె ప్రభుత్వాన్ని నిలదీశారు. జంతర్ మంతర్ వద్ద ఏకంగా 23 రోజుల పాటు అసాధారణమైన నిరాహార

## ముంబైలో ప్రజా నిరసన వెల్లువ.. జ్ఞానేష్ కుమార్ రాజీనామాకు డిమాండ్!



ముంబై శివాజీ పార్క్‌లో జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ భారీ నిరసన చేపట్టారు. ూ×= ప్రక్రియ, ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ వేలాది మంది ఆందోళనలో పాల్గొన్నారు. నిరసనకు వివిధ వర్గాలు, సంస్థలు మద్దతు తెలిపాయి.

### జ్ఞానేష్ కుమార్‌పై సుప్రీంకోర్టులో కీలక విచారణ

ఇద్దరు ఎన్నికల కమిషనర్లను కాదని ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని, సస్పెండ్ చేయాలని పిటిషనర్ వాదన. మధ్యంతర ఉత్తర్వులకు ధర్మాసనం నిరాకరణ.. కానీ జజుజ, ఇద్దరు కమిషనర్లు, కేంద్ర న్యాయ శాఖకు నోటీసులు జారీ చేసి వివరణ కోరిన సుప్రీంకోర్టు.ఓట్ల సవరణ పేరుతో జరుగుతున్న ఎస్ ఐ ఆర్ ప్రక్రియ అమలు తీరు, రాజ్యాంగం గుండెలను బల్లెంతో పొడిచినట్టు ఉందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్, కోట్లాది మంది పౌరుల ఓటు హక్కును తొలగించే ప్రక్రియ రాజ్యాంగ విరుద్ధమని ఇటీవల అక్టోబర్ 2026లో - మిగతా 2 లో

## ఓటుకు నోటు కేసులో కీలక మలుపు

సుప్రీంకోర్టులో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్



- ఓటుకు నోటు కేసులో సుప్రీంకోర్టును ఆశ్రయించిన మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్
- ఈ కేసులో తనను ఇంప్లీడ్ చేయాలని పిటిషన్ దాఖలు
- బాధితుడిగా తన వాదనలు వినాలని కోర్టుకు విజ్ఞప్తి
- కేసును కొట్టివేయాలన్న రేవంత్ రెడ్డి పిటిషన్‌పై విచారణ వేళ ఈ పరిణామం
- పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకున్న సుప్రీం, విచారణ వాయిదా - మిగతా 2 లో

## పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఇంద్రకీలాద్రిపై ప్రధాని మోదీ పేరిట పూజలు



- మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమం
- పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఎంపీ లింగమనేని రమేశ్ పూజల నిర్వహణ
- అమ్మవారికి విశిష్టమైన ఖడ్గమాల అర్చన జరపనున్న ఎంపీ
- ప్రధానికి ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్ష

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంటున్న చారిత్రక సందర్భాన్ని - మిగతా 2 లో

## వైద్య రంగంలో ఈ ఏడాది ముగ్గురికి నోబెల్

# మెదడు రహస్యాలను ఛేదించిన 'ఆప్టోజెనెటిక్స్'

- వైద్యశాస్త్రంలో 2026 నోబెల్ బహుమతి ముగ్గురికి సంయుక్తంగా ప్రకటన
- కార్ల్ డీస్సెరొత్, పీటర్ హెగెమాన్, జార్జ్ నాజెల్‌లను వరించిన పురస్కారం
- ఆప్టోజెనెటిక్స్ అనే టెక్నిక్‌ను అభివృద్ధి చేసినందుకు ఈ గౌరవం
- కాంతిని ఉపయోగించి మెదడులోని నరాల కణాలను నియంత్రించడం దీని ప్రత్యేకత
- జ్ఞాపకాలు, భావోద్వేగాలను అర్థం చేసుకోవడంలో ఈ ఆవిష్కరణ ఒక మైలురాయి



ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ పురస్కారాల ప్రకటన ప్రారంభమైంది. 2026 సంవత్సరానికి గాను వైద్యశాస్త్రంలో (ఫిజియాలజీ/మెడిసిన్) ముగ్గురు శాస్త్రవేత్తలు సంయుక్తంగా ఈ అత్యున్నత పురస్కారానికి ఎంపికయ్యారు. అమెరికాకు చెందిన కార్ల్ డీస్సెరొత్ (స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ), జర్మనీకి చెందిన పీటర్ హెగెమాన్ (హంబోల్ట్ యూనివర్సిటీ), జార్జ్ నాజెల్ (వుర్జ్‌బర్గ్ యూనివర్సిటీ) ఈ గౌరవాన్ని దక్కించుకున్నారు. 'కాంతి ఆధారిత అయాన్ చానెళ్లు, ఆప్టోజెనెటిక్స్'పై వారు చేసిన అద్భుతమైన ఆవిష్కరణలకు గాను నోబెల్ కమిటీ వారిని ఎంపిక చేసినట్లు సోమవారం ప్రకటించింది. ఈ ఆవిష్కరణ న్యూరోసైన్స్ (నాడీశాస్త్రం) రంగంలో

## వివేకా హత్య, లిక్కర్ స్కామ్‌పై సమాధానం చెప్పే ధైర్యం ఉందా?



- ప్రొద్దుటూరులో రూ.30,156 కోట్లతో 'అమరజీవి జలధార' పథకం
- ప్రారంభించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- 90 లక్షల కుటుంబాలకు కుళాయిల ద్వారా సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యం
- రాయలసీమను హార్టికల్చర్, ఏరోస్పేస్, గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మారుస్తామని హామీ
- వివేకా హత్య, లిక్కర్ స్కామ్, ఇసుక కుంభకోణాలపై గొడ్డలి పార్టీ అధినేత సమాధానం చెప్పాలని డిమాండ్ - మిగతా 2 లో

## దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న “నేహా బోరా”

మొదటిపేజీ తరువాయి – దీక్ష చేపట్టడంతో ఆమె పేరు దేశవ్యాప్తంగా మార్మోగింది. నిన్న ఢిల్లీలో ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా కోసం జరిగిన నిరసనలో పోలీసులు ఆమెను చుట్టూ ముట్టి బలవంతంగా అరెస్ట్ చేయాలని ప్రభుత్వం సర్వశక్తులు ఒడ్డి ప్రయత్నించింది. పోలీసులు ఆమెను అడ్డుకోవడానికి విశ్వప్రయత్నాలు చేశారు. కానీ ఆమె చూపిన అసాధారణ తెగింపు, పోరాట పటిమ ముందు పోలీసుల బలప్రయోగం తేలిపోయింది. ఆ ధైర్యం చూసి చివరకు పోలీసులే వెనకడుగు వేయాల్సి వచ్చింది. అధికార బలంతో ఎవరినైనా అణచివేయవచ్చనే అహంకారానికి, భయపడని ఒక యువత స్వరం ఎలా ఎదురునిలుస్తుందో నేహా బోరా నిరూపించారు. థియేటర్ వేదిక నుంచి విద్యార్థి ఉద్యమ రణరంగం వరకు ఆమె సాగిస్తున్న ఈ ప్రయాణం నియంతత్వ పోకడలను ధైర్యంగా ఎదిరించే ప్రతి ఒక్కరికీ ఆమె ప్రయాణం గొప్ప స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది.

## ముంబైలో ప్రజా నిరసన వెల్లువ.. జ్ఞానేష్ కుమార్ రాజీనామాకు డిమాండ్!

మొదటిపేజీ తరువాయి – హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ కార్యక్రమంలో తీవ్రంగా విమర్శించారు. నల్సార్ యూనివర్సిటీ లో ప్రధాన ఉపన్యాసం చేస్తూ ఆయన ఘాటైన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రశ్న అడిగితే సమాధానం చెప్పకుండా , ప్రశ్నకు విమర్శను అస్త్రంగా స్పందించే విధానం మంచిది కాదని కేంద్ర ప్రభుత్వానికి సూచన చేశారు. లక్షల మంది కోట్ల మంది ఓట్లను ఏకపక్షంగా తొలగించడం దీనిని కూడా ఒక వ్యతిరేకమైన రాజ్యాంగ సవరణ ద్వారా, ఆదేశం ద్వారా చేయడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ నేరుగా రాజ్యాంగ స్ఫూర్తిని, ప్రజాస్వామ్య విలువలను, ప్రజాస్వామ్య వ్యవస్థను కూల్చే విధంగా తయారు చేసిందని దీనికి ఏ సమాధానం సమంజసం కూడా కాదని స్పష్టం చేశారు.

## ఓటుకు నోటు కేసులో కీలక మలుపు

మొదటిపేజీ తరువాయి – తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 2015 నాటి ఓటుకు నోటు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన ఫిర్యాదుదారు, నామినేటెడ్ మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన వాదనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా అదనపు వాదనలు వినిపించేందుకు తనకు అవకాశం కల్పించాలని స్టీఫెన్‌సన్ తన పిటిషన్‌లో కోరారు. ప్రధాన ఫిర్యాదుదారుగా తన వాదనలను వినడం నిష్పక్షపాత విచారణకు అత్యంత కీలకమని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు నివేదించారు. ఈ ఇంప్లీడ్ పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంటూ, తదుపరి విచారణను వాయిదా వేసింది. 2015 జూన్‌లో జరిగిన తెలంగాణ శాసనమండలి ఎన్నికల సందర్భంగా ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. టీడీపీ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేసేందుకు అప్పటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి (ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి) రూ. 50 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో తెలంగాణ ఏసీబీ కేసు నమోదు చేసి రేవంత్ రెడ్డి సహా ముగ్గురిని అరెస్ట్ చేయడంతో పాటు నగదును స్వాధీనం చేసుకుంది. ఈ కేసులో ఆడియో, వీడియో రికార్డింగులను కీలక ఆధారాలుగా పేర్కొన్నారు. తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ రేవంత్ రెడ్డి ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ క్వాష్ పిటిషన్‌పై విచారణ జరుగుతున్న తరుణంలో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. తాజా పరిణామాలతో తెలుగు రాష్ట్రాల రాజకీయ, న్యాయ వర్గాల్లో ఈ కేసు మరోసారి చర్చనీయాంశంగా మారింది. తదుపరి విచారణలో ధర్మాసనం ఎలాంటి నిర్ణయం తీసుకోనుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

## సీఎం రేవంత్, నటిపై అసభ్య పోస్టులు

మొదటిపేజీ తరువాయి – ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సినీ నటి సురేఖావాణిని కించపరిచేలా సోషల్ మీడియాలో పెట్టిన ఓ పోస్టు తీవ్ర వివాదాస్పదమైంది. ఈ వ్యవహారంపై టీపీసీసీ సోషల్ మీడియా విభాగం రాష్ట్ర కార్యదర్శి, న్యాయవాది కైలాశ్ సజ్జన్ హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ‘డిగ్‌టీవీ తెలుగు (డిగ్‌టీవీ ప్యారడీ)’ పేరుతో ఉన్న ఓ ఎక్స్ ఖాతాలో సీఎం రేవంత్ రెడ్డి, నటి సురేఖావాణి చిత్రాలను మార్ఫింగ్ చేసి, అసభ్యకరమైన వ్యాఖ్యలతో పోస్ట్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ పోస్ట్ ఉద్దేశపూర్వకంగా ముఖ్యమంత్రి వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీయడంతో పాటు, ప్రభుత్వంపై ప్రజల్లో ద్వేషాన్ని రెచ్చగొట్టేలా ఉందని ఆరోపించారు. అలాగే ఒక మహిళా నటి గౌరవానికి భంగం కలిగించేలా ఈ చర్యకు పాల్పడ్డారని కైలాశ్ సజ్జన్ తన ఫిర్యాదులో స్పష్టం చేశారు. సీఎంను అవమానించడంతో పాటు, నటిని కించపరిచేలా ఉన్న ఈ పోస్టుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఫిర్యాదు స్వీకరించిన నగర సైబర్ క్రైమ్ పోలీసులు సంబంధిత ఎక్స్ ఖాతా నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించి, నిందితులను గుర్తించే పనిలో ఉన్నట్లు తెలిపారు.ం

## కష్టమైన దశ దాటేశారు.. ఎస్ఎల్‌బీసీ పనుల్లో ఇక దూకుడే!

మొదటిపేజీ తరువాయి – అధిగమించారు. దీంతో పనుల వేగం పెంచేందుకు మార్గం సుగమమైంది. అదనపు యంత్రాలను అందుబాటులోకి తెచ్చి పనులను మరింత వేగవంతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2028 జూన్ నాటికి సొరంగం ద్వారా నీటిని అందించడమే లక్ష్యంగా ముందుకెళుతున్నట్లు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని మూడు జిల్లాల ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో మంత్రి ఆదివారం సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఎస్ఎల్‌బీసీ సహా కీలక సాగునీటి ప్రాజెక్టుల పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సొరంగం పూర్తయితే కరవు పీడిత ప్రాంతాలకు 30 టీఎంసీలకు పైగా నీరు అందనుంది. సొరంగం మొత్తం పొడవు 43.968 కిలోమీటర్లు కాగా, ఇప్పటివరకు 79 శాతం పనులు పూర్తయ్యాయి. ఇంకా 9.1 కిలోమీటర్ల మేర తవ్వకాలు చేపట్టాల్సి ఉంది. గత ఐదు, ఆరు నెలల్లో ఇన్‌లెట్, ఔట్‌లెట్ మార్గాల్లో కలిపి సుమారు 700 మీటర్ల మేర పనులు పూర్తయ్యాయి. అత్యంత క్లిష్టమైన షియర్ జోన్‌ను దాటడం ఈ పురోగతిలో కీలకమని మంత్రి పేర్కొన్నారు. సొరంగం తవ్వకాల సమయంలో గతేడాది ఫిబ్రవరిలో ఎనిమిది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. దీంతో ప్రస్తుతం భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. బలహీనమైన భూభాగం, రాళ్లు విరిగిపడే ప్రమాదాలున్న చోట ప్రత్యేక రక్షణ ఏర్పాట్లు చేశారు. 140 మిల్లీమీటర్ల మందం కలిగిన పైపులతో రక్షణ కవచం ఏర్పాటు చేసి తవ్వకాలు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం రోజుకు సగటున ఏడు నుంచి ఏడున్నర మీటర్ల మేర తవ్వకాలు జరుగుతున్నాయి. ఔట్‌లెట్ వద్ద మూడు చేతుల డ్రిల్లింగ్ యంత్రం పనిచేస్తుండగా, అక్టోబరులో ఇన్‌లెట్ వద్ద మరో యంత్రాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. జర్మనీ నుంచి తెప్పిస్తున్న ప్రత్యేక రైలు ఈ నెలాఖరుకు చేరుకోనుంది. దీంతో సొరంగం లోపల తవ్విన మట్టిని, రాళ్లను వేగంగా బయటకు తరలించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఒక విడత తవ్వకాల పనులు పూర్తి కావడానికి 20 నుంచి 24 గంటలు పడుతోంది. కొత్త యంత్రాలు, మెరుగైన రవాణా సదుపాయాలతో ఈ సమయాన్ని పది గంటలకు తగ్గించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. అక్టోబరు చివరి నుంచి పనుల్లో మరింత వేగం పెంచాలని మంత్రి ఆదేశించారు. కార్మికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా, నిర్ణీత గడువులోగా ప్రాజెక్టును పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

## పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఇంద్రకీలాద్రిపై ప్రధాని మోదీ పేరిట పూజలు

మొదటిపేజీ తరువాయి – పురస్కరించుకుని విజయవాడ ఇంద్రకీలాద్రిపై ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అక్టోబర్ 7వ తేదీన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ప్రధాని మోదీ పేరిట ఈ పూజా కార్యక్రమాలను చేపట్టనున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు రాజ్యసభ సభ్యులు లింగమనేని రమేశ్ ఈ పూజలను నిర్వహిస్తున్నారు. 2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రధాని మోదీ ప్రజా ప్రస్థానం ప్రారంభమైంది. అప్పటి నుంచి 2014లో దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి, 25 ఏళ్లుగా తన సేవలను దిగ్విజయంగా కొనసాగిస్తున్నారు. ఈ మైలురాయిని పురస్కరించుకుని, ప్రధాని మోదీకి అమ్మవారి సంపూర్ణ ఆశీస్సులు లభించాలని, ఆయనకు ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ ఈ పూజలు జరపనున్నారు. దేశాన్ని ‘వికసిత్ భారత్’ లక్ష్యం వైపు నడిపిస్తున్న ఆయన నాయకత్వం మరింత బలోపేతం కావాలన్నది ఈ పూజల ముఖ్య ఉద్దేశం. ఈ సందర్భంగా అక్టోబర్ 7వ తేదీ తెల్లవారుజామున బ్రహ్మ ముహూర్తంలో అమ్మవారి అంతరాలయంలో అత్యంత విశిష్టమైన ‘ఖడ్గమాల అర్చన’ను ప్రధాని పేరిట జరపనున్నారు. జగద్గురువు ఆది శంకరాచార్యులు ఇంద్రకీలాద్రిపై ప్రతిష్ఠించిన శ్రీచక్రానికి ఖడ్గమాల స్తోత్రంతో పూజలు నిర్వహిస్తే అమ్మవారి అనుగ్రహంతో పాటు ఆధ్యాత్మిక శక్తి, రక్షణ, శాంతి, సంకల్పసిద్ధి కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ప్రధాని మోదీ నిరంతర దేశ సేవకు కనకదుర్గమ్మ ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, ఆయన నాయకత్వంలో భారతదేశం మరింత సుసంపన్నమైన, ఆత్మనిర్భర దేశంగా ఎదగాలన్న సంకల్పంతో ఎంపీ లింగమనేని రమేశ్ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ పూజల ద్వారా ప్రధానికి సంపూర్ణ ఆరోగ్యం, శక్తి సామర్థ్యాలు లభించాలని ఆకాంక్షించారు.

## వివేకా హత్య, లిక్కర్ స్కామ్‌పై సమాధానం చెప్పే ధైర్యం ఉందా?

మొదటిపేజీ తరువాయి – ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి, ముఖ్యంగా రాయలసీమ దశ, దిశ మార్చడమే లక్ష్యంగా ఎన్డీఏ ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. ప్రొద్దుటూరులో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర గ్రామీణాభివృద్ధికి ఇక్కడి నుంచే పొద్దుపొడుపు అవుతుందని అన్నారు. ఈ సభ వేదికగా రూ.30,156 కోట్ల భారీ బడ్జెట్‌తో ప్రతిష్ఠాత్మక ‘అమరజీవి జలధార’ (జల్ జీవన్ మిషన్ 2.0) పథకానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి శ్రీకారం చుట్టారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 90 లక్షల కుటుంబాలకు ఇంటింటికీ కుళాయి ద్వారా సురక్షితమైన తాగునీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తూ, పలు కీలక అంశాలపై ప్రతిపక్ష నేతకు సవాల్ విసిరారు.

### గ్రామీణ తాగునీటి కష్టాలకు ‘అమరజీవి జలధార’తో చెక్

సభలో చంద్రబాబు మాట్లాడుతూ, “ప్రజల తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ఈ రోజు ప్రొద్దుటూరులో ఈ బృహత్కార్యక్రమాన్ని ప్రారంభించాం. తెలుగు జాతి కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు గారి స్ఫూర్తితో ఈ పథకానికి ‘అమరజీవి జలధార’ అని పేరు పెట్టాం. నీళ్లు తాగిన ప్రతిసారీ ఆయన త్యాగం గుర్తుకురావాలి. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 3 కోట్ల 30 లక్షల మంది ప్రజలకు లబ్ధి చేకూరుతుంది. మహిళల నీటి కష్టాలు తీరడంతో పాటు వారి శ్రమ, సమయం, ఖర్చు ఆదా అవుతాయి” అని వివరించారు. గత ప్రభుత్వం కేంద్రం నిధులను సద్వినియోగం చేసుకోలేకపోయిందని, ఇతర రాష్ట్రాలు వేల కోట్లు వినియోగించుకుంటే, గొడ్డలి పార్టీ కేవలం రూ.2,600 కోట్లు మాత్రమే ఖర్చు చేసి రాష్ట్రానికి అన్యాయం చేసిందని ఆయన ఆరోపించారు.

### రాయలసీమ దశ మార్చేస్తాం.. రత్నాల సీమగా తీర్చిదిద్దుతాం

రాయలసీమ అభివృద్ధిపై తనకున్న దార్శనికతను వివరిస్తూ, “ఒకప్పుడు కరువు సీమ, రాళ్ల సీమగా పిలిచిన ఈ ప్రాంతాన్ని రత్నాల సీమగా, దేశంలోనే అగ్రగామిగా నిలబెడతాం. మదనపల్లెలో లక్ష కోట్ల రూపాయలతో ప్రపంచానికి ఒక హార్టికల్చర్ హబ్‌గా తయారు చేసే కార్యక్రమానికి ఇప్పటికే శ్రీకారం చుట్టాం. రెండేళ్లలో రూ.24,000 కోట్లు ఖర్చు చేశాం. గొడ్డలి పార్టీ ఐదేళ్లలో ఖర్చు చేసింది కేవలం రూ.2,500 కోట్లు మాత్రమే. తేడా మీరే గమనించండి” అని అన్నారు. “రాయలసీమలో కేవలం హార్టికల్చర్ మాత్రమే కాదు, రాబోయే రెండేళ్లలో నెలకు రెండు శాటిలైట్లను ఇక్కడి నుంచే ప్రయోగించేలా స్పేస్ టెక్నాలజీ, పుట్టపర్తి నుంచి శత్రుదేశాల గుండెల్లో వణుకు పుట్టించే ఐదో తరం ఫైటర్ జెట్‌లను తయారు చేసే ఏరోస్పేస్, డ్రోన్ సిటీ, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, స్టీల్, సిమెంట్, గ్రీన్ ఎనర్జీ వంటి ఎన్నో పరిశ్రమలు రానున్నాయి. ఒకప్పుడు స్వర్ణగిరిగా పిలిపించుకున్న జొన్నగిరిలో మళ్లీ బంగారు గనులు వచ్చాయి. రాయలసీమ సత్తా ఇది. కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కేంద్రాలుగా అభివృద్ధి చెందుతాయి. బుల్లెట్ రైళ్లు, రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ తయారీ పరిశ్రమ కూడా ఇక్కడికే వస్తుంది. ఈ ప్రాంత యువత బుల్లెట్‌లా దూసుకుపోవాలి” అని చంద్రబాబు పిలుపునిచ్చారు.

### పవన్ కల్యాణ్ నాయకత్వంలో పల్లెల ప్రగతి

కూటమి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పనితీరును చంద్రబాబు ప్రశంసించారు. “నా మిత్రుడు పవన్ కల్యాణ్ గ్రామీణాభివృద్ధికి కొత్త రూటు వేశారు. మరెక్కడా లేని విధంగా పవన్ కల్యాణ్ రికార్డు స్థాయిలో ఒకేరోజు 13,326 గ్రామాల్లో గ్రామసభలు పెట్టించారు. ఆయన నాయకత్వంలో రెండున్నర దశాబ్దాల తర్వాత 10 వేల మందికి పైగా ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాం. పంచాయతీలకు రూ.4,136 కోట్ల నిధులు విడుదల చేయించాం. లక్షకు పైగా పంట కుంటలు, గోకులాలు ఏర్పాటు చేశారు. ఆయన నేతృత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కోసం ఐదేళ్లలో రూ.1.30 లక్షల కోట్లు ఖర్చు చేయబోతున్నాం” అని ప్రకటించారు.

### గొడ్డలి పార్టీకి సూటి ప్రశ్నలు.. ధైర్యం ఉంటే సమాధానం చెప్పాలి

ఈ క్రమంలో గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్వరంతో విరుచుకుపడ్డారు. “ఈ కడప గడ్డ, ప్రొద్దుటూరు నుంచే సవాల్ విసురుతున్నా. వివేకానంద రెడ్డి హత్య కేసులో వాస్తవాలు బయటకు వచ్చాయి. అంతిమ లబ్ధిదారు ఎవరో తేలిపోయింది. రూ.40 కోట్ల సుపారీ గుట్టు విప్పింది. దీనిపై సమాధానం చెప్పే ధైర్యం ఉందా? లిక్కర్ స్కామ్‌లో వేల కోట్లు దోచిన అంతిమ లబ్ధిదారు కూడా నువ్వేనని అన్ని వేళ్లూ నీ వైపే చూపిస్తున్నాయి. సమాధానం చెప్పగలవా?” అని నిలదీశారు. “ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షల్లో అక్రమాలు చేసి యువత జీవితాలతో ఆడుకున్నారు. ఇసుకను దోచుకున్నారు. మేము అధికారంలోకి వచ్చాక ఉచిత ఇసుక విధానం తెచ్చాం. మద్యం ధరల విషయంలోనూ పారదర్శకంగా ఉన్నాం. కానీ, వాళ్లు నేరాలు చేసి, ఆ నెపాన్ని ఎదుటివారిపై రుద్దడమే పనిగా పెట్టుకున్నారు. అదే వారి డీఎన్‌ఏ. వారికి అభివృద్ధి సిద్ధాంతం కాదు, కుట్రలు, హింసా రాజకీయాలే వారి సిద్ధాంతం” అని దుయ్యబట్టారు.

### ప్రొద్దుటూరుకు వరాలు.. స్థానిక సమస్యలకు పరిష్కారం

స్థానిక ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డి కోరిక మేరకు ప్రొద్దుటూరు అభివృద్ధికి పలు వరాలు ప్రకటించారు. డ్రైనేజీల నిర్మాణం కోసం రూ.35 కోట్లు, కొర్రపాడు రోడ్డు విస్తరణకు రూ.8 కోట్లు తక్షణమే మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ మార్కెట్ రీమోడలింగ్ పనులను త్వరలోనే పరిష్కరిస్తామని, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కాలేజీల భవన నిర్మాణాలను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రాజోలి, అలగనూరు రిజర్వాయర్ల పనులను కూడా పూర్తి చేసి సాగునీటి సమస్యను తీరుస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు.

### ట్రిపుల్ ఇంజన్ సర్కార్‌తో అభివృద్ధి పరుగులు

చివరగా, ప్రజల మద్దతును కోరుతూ, “కేంద్రంలో మోదీ గారి నాయకత్వంలో, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి పాలనతో డబుల్ ఇంజన్ సర్కార్ బుల్లెట్ వేగంతో దూసుకెళ్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కూటమి అభ్యర్థులను గెలిపిస్తే, ట్రిపుల్ ఇంజన్ సర్కార్ వస్తుంది. అప్పుడు అభివృద్ధి మరింత వేగవంతం అవుతుంది. కుట్ర రాజకీయాలను తిప్పికొట్టి, అభివృద్ధికి పట్టం కట్టండి,” అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సభకు హాజరైన ప్రజల ఉత్సాహాన్ని చూసి, వారికి ధన్యవాదాలు తెలుపుతూ, “భారత్ మాతా కీ జై, తెలుగు తల్లికి జై” నినాదాలతో తన ప్రసంగాన్ని ముగించారు.

## భూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత



మొదటిపేజీ తరువాయి – ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి ప్రాధాన్యత క్రమంలో నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం నిర్మల్ జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లా సమావేశానికి రాష్ట్ర ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ లోకేష్‌కుమార్, రెవెన్యూ శాఖ (రిజిస్ట్రేషన్లు, స్టాంపులు) ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హనుమంతు, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్ లతో కలిసి హాజరై

### ఆదిలాబాద్ శాసనమండలి సభ్యులు దండే విఠల్,

ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా, నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత, సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఉట్నూర్ ప్రాజెక్ట్ అధికారి మంద మకరందు, మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావు, ఉమ్మడి జిల్లా అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, ఖానాపూర్, ముధోల్, బోథ్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్, పవార్ రామారావు పటేల్, అనిల్ జాదవ్, కోవ లక్ష్మి, రెవెన్యూ, గృహ నిర్మాణ, అటవీ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా స్థాయి అధికారులతో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు, ప్రజలకు సంబంధించిన సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలు, భూ సంబంధిత అంశాలు, గృహ నిర్మాణాల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ భూములకు సంబంధించిన రికార్డులలో పారదర్శకత, ఖచ్చితత్వం ఉండేలా చూడాలని, ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వీలైనంత మేరకు సేవలను సులభతరం చేయాలని తెలిపారు. రెవెన్యూ శాఖకు సంబంధించి జిల్లాలో కొనసాగుతున్న భూ పరిపాలన, భూ రికార్డుల నిర్వహణ, భూ సమస్యల పరిష్కారం, భూ సంబంధిత దరఖాస్తుల స్వీకరణ--పరిష్కారం, రిజిస్ట్రేషన్లు, స్టాంపులు, భూ రికార్డుల నవీకరణ తదితర అంశాలపై సమీక్షించారు. రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలు, పెండింగ్ సమస్యలు, ప్రభుత్వ కార్యక్రమాల అమలు తీరు, క్షేత్రస్థాయి పురోగతిపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భూ వివాదాలు, రికార్డులలో మార్పులు, హక్కుల నమోదు, ఇతర రెవెన్యూ సంబంధిత అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల మేరకు పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, అర్హత ఉన్న ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు రెవెన్యూ సేవలు మరింత వేగంగా, పారదర్శకంగా, జవాబుదారీతనంతో అందేలా చర్యలు చేపట్టాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు చొరవ చూపాలని, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించి నిబంధనల ప్రకారం నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ధిదారుల ఎంపిక, గృహాల మంజూరు, నిర్మాణ ప్రారంభం, వివిధ దశలలో ఉన్న ఇండ్ల సంఖ్య, నిర్మాణాలు పూర్తి కాని కారణాలు, పెండింగ్‌లో ఉన్న గృహాల నిర్మాణాన్ని వేగవంతం చేయడానికి తీసుకుంటున్న చర్యలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రయోజనం అందేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని, ఇప్పటికే మంజూరైన గృహాల నిర్మాణాలను వేగవంతం చేయాలని, నిర్మాణాలు ప్రారంభం కాని ఇండ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. గృహ నిర్మాణాల పురోగతిని గ్రామ, మండల స్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని, లబ్ధిదారులకు అవసరమైన మార్గదర్శకత్వం, శాఖల మధ్య సమన్వయం అందించాలని సూచించారు. నిర్మాణాలు వివిధ దశలలో నిలిచిపోయిన చోట సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గృహ నిర్మాణానికి సంబంధించి లబ్ధిదారులకు ఎదురవుతున్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని, నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా జరిగేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. జిల్లాల వారీగా భూ సమస్యల పరిష్కారం, రెవెన్యూ దరఖాస్తుల పరిష్కారం, ప్రభుత్వ గృహ నిర్మాణాల పురోగతి, పెండింగ్ పనులు, ప్రజలకు అందుతున్న సేవలు తదితర అంశాలపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి జిల్లాలో ప్రజలకు సంబంధించిన ప్రధాన సమస్యలను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని, ముఖ్యంగా పేదలు, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చూడాలని సూచించారు. రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలతో పాటు అవసరమైన చోట అటవీ, పంచాయతీరాజ్, మున్సిపల్ తదితర శాఖల మధ్య సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత సమయంలో సాధించేలా ప్రతి శాఖకు స్పష్టమైన కార్యాచరణ ఉండాలని, పెండింగ్‌లో ఉన్న పనులు, దరఖాస్తులు, నిర్మాణాలను గుర్తించి పరిష్కరించాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న గృహ నిర్మాణ పథకాలు అర్హులైన పేద కుటుంబాలకు భరోసా కల్పించే విధంగా అమలవుతున్నందున, లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని తెలిపారు. అంతకుముందు నిర్మల్ జిల్లాలోని బాసర ప్రాంతంలో గోదావరి పుష్కరాలకు సంబంధించి రహదారుల అభివృద్ధి పనులు, లోకేశ్వరం మండల కేంద్రం, దస్తురాబాద్ మండలం గొడిసెరాల గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఫ్యూచర్ సిటీలో విదేశీ వర్సిటీల క్యాంపస్‌లు



మొదటిపేజీ తరువాయి – చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోంది. ఫ్యూచర్ సిటీలో ప్రముఖ విదేశీ యూనివర్సిటీల క్యాంపస్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక పాలసీ రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. తెలంగాణను అంతర్జాతీయ విద్యా కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. ఇప్పటికే యూనివర్సిటీ ఆఫ్ లండన్, యూనివర్సిటీ ఆఫ్ బర్మింగ్‌హామ్‌తో పాటు మరో నాలుగు అంతర్జాతీయ యూనివర్సిటీలు ఫ్యూచర్ సిటీలో క్యాంపస్‌లు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపినట్లు అధికారులు సీఎస్‌కు తెలిపారు. విదేశీ వర్సిటీలను ఆహ్వానించడం, అవసరమైన మౌలిక వసతులు కల్పించడం, పెట్టుబడులకు అవకాశం కల్పించడం, అనుమతులు సులభతరం చేయడం, విద్యా కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాలను పాలసీలో చేర్చాలని సంజయ్ జాజు సూచించారు. తెలంగాణ విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతిపాదిత వర్సిటీల ప్రతినిధులతో చర్చలు జరిపి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. త్వరలో జరగనున్న గ్లోబల్ సమ్మిట్ నాటికి ఈ ప్రణాళిక సిద్ధంగా ఉండాలని సూచించారు. ఇదే సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్మిస్తున్న ‘యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్’పైనా సమీక్షించారు. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దశలవారీగా ఈ పాఠశాలలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2027 డిసెంబర్ నాటికి 67 పాఠశాలలను పూర్తి చేయాలని, 2028 జూన్ నాటికి ఈ సంఖ్యను 87కి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒక్కో పాఠశాలను సుమారు 26 ఎకరాల్లో నిర్మించనున్నారు. క్రీడా మైదానాలు, హాస్టళ్లు, సిబ్బంది క్వార్టర్లు, ఆధునిక వంటశాలలు, డిజిటల్ తరగతి గదుల వంటి సదుపాయాలు కల్పించనున్నారు. నిర్మాణ పనులను క్రమం తప్పకుండా సమీక్షించి, నాణ్యతతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు.

## వైద్య రంగంలో ఈ ఏడాది ముగ్గురికి నోబెల్ మెదడు రహస్యాలను ఛేదించిన ‘ఆప్టోజెనెటిక్స్



మొదటిపేజీ తరువాయి – ఒక కొత్త శకానికి నాంది పలికింది. మన మెదడు జ్ఞాపకాలను, భావోద్వేగాలను, ప్రవర్తనలను ఎలా నియంత్రిస్తుందనేది ఎన్నో శతాబ్దాలుగా ఒక పెద్ద మిస్టరీ. 20వ శతాబ్దంలో శాస్త్రవేత్తలు మెదడులోని ఏయే ప్రాంతాలు ఏయే పనులను ప్రభావితం చేస్తాయో పరిశోధించడం మొదలుపెట్టారు. కానీ, అప్పటి పద్ధతులతో కచ్చితమైన కారణాలను నిర్ధారించడం సాధ్యపడలేదు. వారి వద్ద ఉన్న మెదడు చిత్రం, ఎన్నో ప్రశ్నలతో, ఖాళీలతో నిండిన ఒక చిత్తుపటంగానే మిగిలిపోయింది. అయితే, ఆప్టోజెనెటిక్స్ రాకతో ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. “ఒకప్పుడు కల అనుకున్న మెదడును మ్యాపింగ్ చేసే అవకాశాన్ని ఆప్టోజెనెటిక్స్ సాకారం చేసింది” అని నోబెల్ కమిటీ ఛైర్మన్ పెర్ స్వెన్నింగ్‌సన్ వ్యాఖ్యానించారు. ఈ అద్భుత ఆవిష్కరణకు పునాది వేసింది పీటర్ హెగెమాన్ జిజ్ఞాస. ‘క్లామిడోమోనాస్’ అనే ఒకే కణం కలిగిన నాచు (ఆల్గే) కాంతి ఉన్నవైపు ఎలా ఈదగలుగుతోందని ఆయన ఆలోచించారు. 2000ల ప్రారంభంలో, ఆయన తన సహచరుడు జార్జ్ నాజెల్‌తో కలిసి ఆ నాచు కణం ఉపరితలంపై ‘ఛానెల్‌రోడోప్సిన్’ అనే ఒక ప్రత్యేకమైన ప్రొటీన్‌ను కనుగొన్నారు. దీనిపై నీలి రంగు కాంతి పడినప్పుడు, ఆ ప్రొటీన్‌లో ఒక మార్గం (ఛానెల్) తెరుచుకుని, అయాన్లు కణం లోపలికి ప్రవహించి ఒక విద్యుత్ సంకేతాన్ని సృష్టిస్తాయని వారు గుర్తించారు. ఈ ప్రొటీన్‌ను ఏ కణంలో ప్రవేశపెట్టినా, ఆ కణం కాంతికి స్పందించేలా మారుతుందని నిరూపించారు. ఈ పరిశోధనను కార్ల్ డీస్సెరొత్ మరో స్థాయికి తీసుకెళ్లారు. ఆయన ఛానెల్‌రోడోప్సిన్ జన్యువును ఎలుకల మెదడులోని నరాల కణాలలోకి ప్రవేశపెట్టారు. ఆ తర్వాత వాటిపై నీలి కాంతిని ప్రసరింపజేసి, నరాల సంకేతాలను విజయవంతంగా ప్రేరేపించగలిగారు. 2005లో ఆయన ఈ ప్రయోగాన్ని ప్రచురించగా, రెండేళ్ల తర్వాత 2007లో బతికున్న ఎలుకల మెదడులో ఈ ‘కాంతి ఆధారిత స్విచ్’ పనిచేసేలా చేసి సంచలనం సృష్టించారు. ప్రస్తుతం ‘ఆప్టోజెనెటిక్స్’ అని పిలుస్తున్న ఈ పద్ధతి ప్రపంచవ్యాప్తంగా వేగంగా ప్రాచుర్యం పొందింది. దీనిని ఉపయోగించి పరిశోధకులు నిర్దిష్ట జ్ఞాపకాలు, భయం, ఆనందం వంటి భావోద్వేగాలు, ప్రవర్తనలను నియంత్రించే నాడీ వలయాలను (న్యూరల్ సర్క్యూట్స్) ఛేదిస్తున్నారు. ఇది మానసిక, నాడీ సంబంధిత వ్యాధులపై మన అవగాహనను పెంచుతోంది. వైద్య రంగంలో, దృష్టి లోపం ఉన్నవారికి తిరిగి చూపును అందించే ప్రయత్నాలలో ఈ పద్ధతిపై ప్రయోగాలు జరుగుతున్నాయి. ఆప్టోజెనెటిక్స్ ఆవిష్కరణ మన మెదడుపై ఉన్న అవగాహనను సమూలంగా మార్చేసింది. ఈ సాంకేతికత సాయంతో ప్రతిరోజూ కొత్త ఆవిష్కరణలు వెలుగులోకి వస్తూ, మానవాళి ముందున్న అతిపెద్ద రహస్యాలలో ఒకటైన మన మెదడు పనితీరును అర్థం చేసుకోవడానికి మార్గం సుగమం చేస్తున్నాయి.

# కొలనూర్ లో సంస్మరణ సభ



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** నేత్రదాత జంగ సుధాకర్ రెడ్డి సంస్మరణ సభను వారి నివాసం పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కొలనూరు లోని రెడ్డినగర్లో కుటుంబ సభ్యులు సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి డాక్టర్ మేరుగు భీష్మాచారి ఆధ్వర్యంలో నిర్వహించి వచ్చిన బంధు మిత్రులకు నేత్ర అవయవ శరీర దానాలపై అవగాహన కల్పించడం జరిగింది. ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించిన భార్య పుష్ప, కుమారుడు కోడలు రఘువీరారెడ్డి - వనజ, కుమార్తె అల్లుడు రచన - రంజిత్ రెడ్డి లకు గ్రామ సర్పంచ్ పల్లె కనకయ్య ఉప సర్పంచ్ పాకాల సంపత్ రెడ్డి వార్డు మెంబర్ మాటేటి. జ్ఞాపికను అందజేసి అభినందనలు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కె.శ్రీనివాస్, కుమార్ రెడ్డి, శ్రీహిత ఫ్లెక్సీ సత్యనారాయణ రెడ్డి తదితరలు పాల్గొన్నారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమంపై కొత్తగూడెంలో ప్రత్యేక సమావేశం



**భద్రాద్రి కొత్తగూడెం, (పోరు తెలంగాణ-పినపాక నియోజకవర్గ ప్రతినిధి) మణుగూరు అక్టోబర్ 5:-** నమస్కారం మిత్రులారా, 06-10-2026 (మంగళవారం) నా మధ్యాహ్నం 3:00 గంటలకు కొత్తగూడెం జిల్లా పార్టీ కార్యాలయంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమంపై జిల్లాలోని 5 నియోజకవర్గాలకు చెందినబి.ఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరుగుతుంది. ఈ సమావేశానికి రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర , ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జ్ ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు,మాజీ మంత్రి వర్యులు వనమా వెంకటేశ్వరరావు మన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు మెచ్చ నాగేశ్వరరావు,మాజీ శాసనసభ్యురాలు బానోతు హరిప్రియ, జిల్లా నాయకులు రావులపల్లి రాంప్రసాద్, భద్రాచలం నియోజకవర్గ నాయకులు మానె రామకృష్ణ,ముఖ్య అతిథులుగా హాజరవుతారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మన పార్టీ బలాన్ని మరింత పెంచేందుకు అర్హత కలిగిన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరును గుర్తించి, ఓటరుగా నమోదు చేయించేలా కార్యాచరణ రూపొందించుకోవడం ఈ సమావేశం ప్రధాన ఉద్దేశ్యం. కాబట్టి 5 నియోజకవర్గాలకు చెందిన బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, బాధ్యులు తప్పనిసరిగా హాజరై ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరుతున్నాను. రేగా కాంతారావు మాజీ బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పినపాక మాజీ శాసనసభ్యులు.

## సేవ్ డెమోక్రసీ మార్చ్ ఫాస్ట్‌ను విజయవంతం చేయాలని అఖిల పక్ష పార్టీల పిలుపు



**భద్రాద్రి కొత్తగూడెం, పోరు తెలంగాణ-పినపాక నియోజకవర్గం (ప్రతినిధి) అశ్వాపురం అక్టోబర్ 5 :-** సర్ పేరుతో ఓటర్ల హక్కులకు భంగం కలిగించే చర్యలకు వ్యతిరేకంగా అఖిలపక్ష పార్టీల పిలుపు మేరకు నిర్వహిస్తున్న "సేవ్ డెమోక్రసీ మార్చ్ ఫాస్ట్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలంటూ ఈరోజు అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఓరుగంటి వీరయ్య భవన్ నందు కాంగ్రెస్ పార్టీ తో పాటు తెలుగుదేశం, సీపీఐ, సిపిఎం,ఎజీూ,తెలంగాణ రాజ్యాధికార పార్టీ బాధ్యులతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి ఈనెల 8వ తేదీ జిల్లా కలెక్టర్ ఆర్యాలయం నుండి అఖిల పక్ష పార్టీల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 'సేవ్ డెమోక్రసీ మార్చ్ ఫాస్ట్' కార్యక్రమంలో అన్ని పార్టీల కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని దిగ్విజయం చేయాలని కోరారు.ఓటు అనేది ప్రతి భారతీయుని ప్రాథమిక హక్కు అని, బీజేపీ మోసపూరిత కుట్రలతో ప్రతిపక్ష పార్టీలను తొక్కివేసే దురాలోచనలతో వ్యక్తుల ప్రాథమిక హక్కు ను హరించడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని,ఈ కుట్రను భగ్నం చేసే అవసరం అందరిపై ఉందని, ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు రక్షణ, ఓటర్ల జాబితాలో పారదర్శకత కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు,కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొనాలని కోనైనది. ఈ కార్యక్రమంలో అశ్వాపురం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గాదె కేశవరెడ్డి, మండల తెలుగు దేశం పార్టీ కార్యదర్శి జజ్జవరపు వాసు, ఏఐటియుసి మండల అధ్యక్షుడు రాయపూడి రాజేష్, ఏడెల్లి కమలాకర్,తెలంగాణా రాజ్యాధికార పార్టీ మండల అధ్యక్షుడు ఇలాసాగరపు కోటేశ్వరరావు,తెలంగాణా రాజ్యాధికార పార్టీ ూజ సెల్ అధ్యక్షుడు గద్దల నాగేశ్వరావు, సిపిఎం కార్యవర్గ సభ్యులు మండేపూడి సాంబశివరావు, ఎజీూ మండల అధ్యక్షుడు పగడాల కరుణాకర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భీమారంలో ఘనంగా కాకా వెంకటస్వామి జయంతి

చీరలను పంపిణీ చేసిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోడేటి రవి.





**పోరు తెలంగాణ, మంచిర్యాల, అక్టోబర్ 5 :** భీమారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పోడేటి రవి ఆధ్వర్యంలో దివంగత నేత, మాజీ కేంద్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం కాకా వెంకటస్వామి జయంతి ఉత్సవాలను నిర్వహించారు. కాకా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాకా వెంకటస్వామి చేసిన సేవలు,కార్మికులకు అందించిన సేవలు,బడుగుబలహీన వర్గాలకు అందించిన సేవలు,పెన్షన్ స్కీ కోసం ఆయన చేసిన కృషి ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మండల కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగ ఉర్స్ ఇ షరీఫ్ గ్రంధోత్సవ వేడుకలు



**మహేశ్వరం, అక్టోబర్ 5, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** గట్టుపల్లి గ్రామంలో హాజరత్ సయ్యదినా మహబూబ్ సుభాని రహమతుల్లా అలై ఉర్స్ ఇ షరీఫ్ గ్రంధోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. మహేశ్వరం గ్రామ జామా మజీద్ ఇమాం సహాబ్ హాఫిజ్ సయ్యద్ అహ్మద్ అలీ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి దర్గాకు గ్రంథము గిలాఫ్ చద్దర్ పువ్వులు సమర్పించి ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఎల్లప్పుడు సంతోషంగా ఉండాలని ప్రత్యేక దువ చేశారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం జామా మజిద్ ఇమాం సహాబ్ హాఫిజ్ సయ్యద్ అహ్మద్ అలీ, గట్టుపల్లి గ్రామ దర్గా సేవకుడు మొహమ్మద్ గ్రామ పెద్దలు మహమ్మద్ హయ్యూం, మహమ్మద్ గౌస్ పాషా, మహమ్మద్ సాబీర్, మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు షేక్ హాజీ బాబా, కార్యదర్శి మొహమ్మద్ జలాలుద్దీన్, సభ్యులు మొహమ్మద్ వాజిద్, గట్టుపల్లి గ్రామ మజీద్ ఇమాం సహాబ్ హాఫిజ్ షేక్ ఆరిఫ్, మహేశ్వరం గ్రామ జామ మజీద్ మౌజన్ సహాబ్ మహమ్మద్ ముస్తాక్ ఖాదిరి, చోటి మజీద్ మౌజాన్ సాహెబ్ సయ్యద్ షబాజ్ అలీ,మహేశ్వరం గ్రామ యువకులు మొహమ్మద్ సాజిద్, మొహమ్మద్ రజాక్ ఖురేషి, షేక్ జుబేర్ పాల్గొన్నారు.

# జైపూర్ కేజీబీవీలో వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాలు



**పోరు తెలంగాణ మంచిర్యాల అక్టోబర్ 5 :** వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా జైపూర్ కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం లో అటవీ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని, అడవులు, వన్యప్రాణులు, పర్యావరణ పరిరక్షణ మరియు జీవవైవిధ్యానికి సంబంధించిన వివిధ ప్రశ్నలకు చక్కటి సమాధానాలు అందించారు. విద్యార్థులలో అటవీ సంపద, వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన పెంపొందించేలా ఈ కార్యక్రమం ఎంతో ఆసక్తికరంగా సాగింది. పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు అటవీ శాఖ తరపున సర్టిఫికెట్లు అందజేసి వారిని అభినందించారు. విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీసేలా నిర్వహించిన డ్రాయింగ్ పోటీ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రామకృష్ణ సర్కార్, బీట్ ఆఫీసర్లు వసంతలక్ష్మి , కే.రమేష్, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం ప్రిన్సిపల్ ఫణిబాల, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

# జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం భోజనం ప్రారంభం

ముఖ్యఅతిథి ఓదెల సర్పంచ్ కనికిరెడ్డి సతీష్



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుండి ఇంటర్మీడియట్ విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజన పథకం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఓదెలలో కళాశాల ప్రిన్సిపల్ చకిలం అమరేందర్ ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ ముఖ్యఅతిదులుగా కనికిరెడ్డి సతీష్, ఎంపీడీవో అనిల్ రెడ్డి హాజరై మధ్యాహ్నం భోజనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రం లో ఉన్న కళాశాలకు మారుమూల వివిధ గ్రామాల నుండి ఉదయమే కళాశాలకు వస్తూన్న విద్యార్థులకు ఉదయము టిఫిన్ , మధ్యాహ్నము భోజనము ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అమలు చేస్తున్న బ్రేక్ ఫాస్ట్ మధ్యాహ్న భోజన పథకము విద్యార్థులకు అందించడం సంతోషకరంగా ఉందని, దీనితో హాజరు శాతం పెరుగుతుందని ప్రభుత్వ కళాశాలలో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని కళాశాల ఉత్తీర్ణత శాతం కూడా పెరిగే అవకాశం ఉందని తెలియజేస్తూ ఈ పథకాన్ని అమలు చేస్తున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపన్యాసకులు ఆఫీస్ సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## దోమకొండ ప్రజావాణికి మూడు దరఖాస్తులు.






**కామారెడ్డి జిల్లా ప్రతినిధి దోమకొండ, అక్టోబర్ 5 (పోరు తెలంగాణ న్యూస్:) :** దోమకొండ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి మూడు దరఖాస్తులు అందినట్లు ఎంపీడీవో మధురిమ తెలిపారు. వివిధ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను స్వీకరించిన అధికారులు, సంబంధిత శాఖల అధికారులు వాటిని పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రవి, తహసీల్దార్ స్వప్న, ఎక్సైజ్ ఎస్సై దీపిక, సూపరింటెండెంట్ మనోహర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అమ్మ హాస్పిటల్ ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 5(పోరు తెలంగాణ న్యూస్:) :** కామారెడ్డి జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన అమ్మ హాస్పిటల్ ని ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ జిల్లా కేంద్రంలో నూతన హాస్పిటల్ ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మరియు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్, మున్సిపల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు సందీప్, మాజీ డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, సొసైటీ చైర్మన్లు గూడెం శ్రీనివాస్, భీంరెడ్డి, నౌసిలాల్, అనంత్ రెడ్డి, సుతారి రమేష్, అనంత్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు నౌసిలాల్, కృష్ణారావు, శ్రీనివాస్, నరేందర్ రెడ్డి, రాజగౌడ్, రాజు, ూజ సెల్ జిల్లా అధ్యక్షులు బాలరాజు, ూు సెల్ జిల్లా అధ్యక్షులు రెడ్డి నాయక్, డీసీసీ ఉపాధ్యక్షులు గంప ప్రసాద్, కౌన్సిలర్లు షేరు, సత్యం, అంజాద్, జావీద్, లడ్డు, సిద్దిక్, చిట్టిబాబు, గణేష్, గంగాధర్, మజీద్, కో ఆప్షన్ సభ్యులు ముబషీర్, అలీ బిన్ అబ్దుల్లా, సీనియర్ నాయకులు పండ్ల రాజు, వెంకట్ రావు, సుదర్శన్, వెంకటేష్, సలీం, భాస్కర్, నవీన్, ఘాజి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జైపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గడ్డం వెంకటస్వామి (కాకా) జయంతి వేడుకలు

ప్రజావాణి కార్యక్రమం నిర్వహణ.





**పోరు తెలంగాణ మంచిర్యాల అక్టోబర్ 5 :** జైపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం, దివంగత నేత గడ్డం వెంకటస్వామి కాక జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా కాక చిత్రపటానికి పూలమాలవేసి, వారు ప్రజల సంక్షేమం కోసం చేసిన సేవలను ప్రజల పట్ల చూపిన అంకిత భావాన్ని స్మరించుకున్నారు. అనంతరం, ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు . ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం (01) ఫిర్యాదు అందగా, వాటిలో రెవెన్యూ శాఖకు (01) ఫిర్యాదు వచ్చింది. సంబంధిత శాఖల అధికారులు ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీపతి బాపు రావు మాట్లాడుతూ, మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తమ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను ప్రజావాణిలో సమర్పించి పరిష్కారం పొందవచ్చని తెలిపారు.

## ఇబ్రహీంపట్నం మండలం మాజీ సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షులుగా సోమ ప్రభాకర్



**పోరు తెలంగాణ ప్రతినిధి // మెట్ పల్లి :** జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలోని అంబేద్కర్ పార్క్ లో తెలంగాణ మాజీ సర్పంచ్ల సంక్షేమ సంఘం ఇబ్రహీంపట్నం మండలం అధ్యక్షులుగా సోమ ప్రభాకర్ ఎన్నికైనందున మాజీ సర్పంచులు సన్మానించారు. ఈ సందర్భంగా సోమ ప్రభాకర్ మాట్లాడుతూ..... ప్రతి గ్రామంలో సర్పంచ్ ప్రథమ పౌరుడుగా ఉండి ప్రజల సమస్యలపై నిరంతరం కృషి చేస్తూ అనేక ఒడిదుడుకులు ఎదుర్కొన్నప్పటికీ ప్రజల అభివృద్ధికి పాటుపడుతున్నారని అన్నారు. ప్రభుత్వాల నుండి నిధులు రాకపోయినా అప్పులు చేసి గ్రామ అభివృద్ధికి సర్పంచులు కృషి చేస్తూ అప్పుల ఊబిలో కూరుకుపోయి తమ ప్రాణాలను పణంగా పెట్టి గ్రామాభివృద్ధిలో బాటలు వేస్తున్న మాజీ సర్పంచ్లకు ఎన్నికలకు ముందు ప్రవేశ పెట్టిన మేనిఫెస్టో ప్రకారం పదివేల పింఛను,బస్సు పాస్ సౌకర్యం, హెల్త్ కార్డు కల్పించాలంటూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వేడుకుంటున్నామని అన్నారు. మాజీ సర్పంచ్ల అభ్యున్నతికై నిరంతరం కృషి చేస్తానని ఇబ్రహీంపట్నం మండలం అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నానని సోమ ప్రభాకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాజీ సర్పంచ్ సంక్షేమ సంఘం కోరుట్ల నియోజకవర్గ అధ్యక్షులు జంగా గంగ స్వామి,మాజీ సర్పంచ్లు బద్దం శేఖర్ రెడ్డి, డబ్బా నరసయ్య,సోన్నాయిల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# మద్దికల్ గ్రామపంచాయతీ లో కాక వెంకట స్వామి జయంతి



**పోరు తెలంగాణ,మంచిర్యాల జిల్లా అక్టోబర్ 5 :** భీమారం మండలం మద్దికల్ గ్రామపంచాయతీలో సర్పంచ్ పోతేం సమ్మయ్య ఆధ్వర్యంలో దివంగత నేత, మాజీ కేంద్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వెంకటస్వామి కాక జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కాకా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కాకా వెంకటస్వామి చేసిన సేవలు,కార్మికులకు అందించిన సేవలు,బడుగుబలహీన వర్గాలకు అందించిన సేవలు,పెన్షన్ స్కీ కోసం ఆయన చేసిన కృషి ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోతేం సమ్మయ్య, ఉప సర్పంచ్, పాలకవర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి గణేష్, కారోబార్ చందు, గ్రామపంచాయతీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## మెరిట్ ప్రాతిపదికంగాఅంగన్వాడి ఆయా పోస్టులకు ఇంటర్వ్యూలు



**బూర్గంపాడు, అక్టోబర్ 5 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** బూర్గంపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఆయా పోస్టుల భర్తీకి మెరిట్ ఆధారంగా సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మోరంపల్లి బంజర గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగిన ఈ ప్రక్రియను జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ తోట మల్ల ప్రతాప్, జిల్లా సంక్షేమ అధికారిణి స్వర్ణలత లెనినా, డిప్యూటీ డీఎంహెచ్‌వో బాలకృష్ణ పర్యవేక్షించారు.ప్రాజెక్టు పరిధిలో మొత్తం 187 ఆయా పోస్టులకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు అందగా.. సోమవారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు 178 మంది హాజరయ్యారు. మరో తొమ్మిది మంది గైర్హాజరయ్యారు. అభ్యర్థుల హాజరు, అర్హత తదితర అంశాలను పరిశీలిస్తూ ఇంటర్వ్యూ ప్రక్రియ కొనసాగింది.కార్యక్రమంలో బూర్గంపాడు సీడీపీవో మంగతాయారు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# రంగులతో ముస్తాబైన బతుకమ్మ ఘాట్

సర్పంచ్ కనికిరెడ్డి సతీష్ ఆధ్వర్యంలో





**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మ పండుగతో మండలంలోని 22 గ్రామాలలో బతుకమ్మ వేడుకలు రంగ రంగ వైభవంగా నిర్వహించాలని సర్పంచులు బతుకమ్మ ఆట స్థలాలను ముస్తాబు చేస్తున్నారు ఇందులో భాగంగా ఓదెల మండల కేంద్రంలో స్థానిక సర్పంచ్ కనికి రెడ్డి సతీష్ గెలిచిన ఏడాదిలోపే లక్షల నిధులతో గ్రామ అభివృద్ధిలో భాగంగా సీసీ రోడ్లు, సుందరమైన గ్రామపంచాయతీ , మహిళలు బతుకమ్మ పండుగ ఆటల పాటలతో ఆడి బతుకమ్మ నిమజ్జనం కోసం ఆరు లక్షలతో బతుకమ్మ ఘాటు మెట్లు పూర్తి చేశారు. గ్రామంలో బతుకమ్మ ఘాటు పర్యాటక శోభ సంతరించుకుంటుంది.

# ప్రజావాణి వినతులకు సత్వర పరిష్కారం చూపాలి : జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం అక్టోబర్ 5 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** ప్రజల నుంచి స్వీకరించే ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, డిఆర్ఓ పద్మావతి తో కలిసి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. భూ సంబంధిత సమస్యలు, రెవెన్యూ అంశాలు, సంక్షేమ పథకాలు, ఉపాధి, పింఛన్లు, గృహాలు, మౌలిక వసతులు, సామాజిక భద్రత తదితర సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమం ముఖ్యమైన వేదికగా నిలుస్తోందన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి దరఖాస్తును అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి తావివ్వరాదని స్పష్టం చేశారు. తక్షణమే పరిష్కరించగల సమస్యలను ఎలాంటి ఆలస్యం లేకుండా పరిష్కరించాలని, క్లిష్టమైన సమస్యలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంతో పాటు మండల స్థాయిలోని ఎంపీడీవో కార్యాలయాల్లో కూడా ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమకు సమీపంలోని ఎంపీడీవో కార్యాలయంలో వినతులు సమర్పించి, స్థానిక స్థాయిలోనే సమస్యలకు పరిష్కారం పొందాలని సూచించారు. వినతులతో పాటు సంబంధిత ఆధార పత్రాలను సమర్పిస్తే సమస్యల పరిష్కారం మరింత వేగంగా జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థుల అభ్యసనకు అనుకూల వాతావరణం కల్పించాలి : జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం అక్టోబర్ 5 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** జూలూరుపాడు మండలం కొమ్ముగూడెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, పరీక్షల నిర్వహణ, విద్యార్థుల హాజరు, మౌలిక సదుపాయాలు, పోషకాహారం తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాఠశాలలో నిర్వహిస్తున్న ఎస్ఏ--1 పరీక్షలను కలెక్టర్ పరిశీలించారు. వివిధ తరగతుల విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తీరును గమనించి, వారు రాస్తున్న ప్రశ్నపత్రాలను పరిశీలించారు. పరీక్షల నిర్వహణ విధానం, విద్యార్థుల అభ్యసన స్థాయి తదితర వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను పరిశీలించిన కలెక్టర్, 'మన ఊరు--మన బడి' కార్యక్రమం కింద పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో చేపట్టిన పనులు, వాటి ప్రస్తుత పరిస్థితి, విద్యార్థులకు వాటి ద్వారా కలుగుతున్న ప్రయోజనాలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న ప్రీ-ప్రైమరీ పాఠశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. అక్కడ 14 మంది చిన్నారులు విద్యనభ్యసిస్తున్నట్లు తెలుసుకున్న ఆయన, వారికి అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. చిన్నారులకు నూతనంగా అందించనున్న ఏకరూప దుస్తులను పరిశీలించారు. వారి వయస్సుకు అనుగుణంగా విద్యాబోధన జరుగుతున్న తీరును, చిన్నారులకు కల్పిస్తున్న అభ్యసన వాతావరణాన్ని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులు ఆటల ద్వారా ఉల్లాసంగా నేర్చుకునేలా పాఠశాలలో ఏర్పాటు చేసిన బొమ్మలు, ఆట వస్తువులను కలెక్టర్ పరిశీలించారు. తరగతి గదుల్లో పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చూడాలని, ఆటలు, బొమ్మలు, ఇతర అభ్యసన సామగ్రిని వినియోగిస్తూ చిన్నారుల్లో ఆసక్తిని పెంపొందించాలని సూచించారు. విద్యార్థులకు అందిస్తున్న పోషకాహారంపై కూడా కలెక్టర్ ఆరా తీశారు. ఈ తనిఖీలు కలెక్టర్ వెంట తాసిల్దార్ శ్రీనివాస్, ఎంఈఓ జుంకీ లాల్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి రూ.15 లక్షల విలువైన వైద్య పరికరాలు అందజేసిన భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు భద్రాచలం ఐటిడిఎ పిఓ రాహుల్



**భద్రాచలం అక్టోబర్ 5 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రూ.15 లక్షల విలువైన వైద్య పరికరాలను భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ తో కలిసి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీ రాజశేఖర్ రెడ్డి కి అందజేశారు.

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ...**

ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి అవసరమైన ఆధునిక వైద్య పరికరాలను సమకూర్చడం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేసి, నాలుగు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతం నుంచి వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వైద్య పరికరాలను సద్వినియోగం చేసుకుని రోగులకు మెరుగైన సేవలు అందించాలని వైద్యులు, సిబ్బందిని కోరారు.

**ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో శ్రీ రాహుల్ మాట్లాడుతూ...**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులు, వైద్య సదుపాయాలను మెరుగుపరచడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. భద్రాచలం ఏరియా ఆసుపత్రికి అందించిన వైద్య పరికరాల ద్వారా రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ఐటీడీఏ నిధులతో కంటి పరీక్ష, బ్లడ్ టెస్టింగ్, ఈసీజీ మిషన్లు, ఆక్సిజన్ సిలిండర్లు తదితర పరికరాల అందజేసిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఐటీడీఏ పీవో బి.రాహుల్ చేతుల మీదుగా ఆసుపత్రికి వితరణ. ఇచ్చారు ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో ఐసీయూ ఇన్‌చార్జ్ డాక్టర్ జగదీష్ డాక్టర్ మల్లేష్ , పార్టీ నర్రా రాము, భీమవరపు వెంకటరెడ్డి, యూత్ నాయకులు గాడి విజయ్, మాచినేని భాను, ఎండి సుభాని, కొప్పుల వంశీ మరియు హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ సాగర్ పైపులు చోరీ కేసులోఆరుగురు అరెస్ట్

**భద్రాద్రి కొత్తగూడెం,పోరు తెలంగాణ-పినపాక నియోజకవర్గ (ప్రతినిధి-వల్లెపోగు రాము) అశ్వాపురం అక్టోబర్ 5:-** అశ్వాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని సర్వాయిపాడు గ్రామ శివారులో ఉన్న రాజీవ్ సాగర్ కాలువకు సంబంధించిన ఇనుప పైపులను దొంగతనం చేశారని ఇరిగేషన్ ఏఈఈ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగింది. ఈ రోజు ఉదయం నమ్మదగిన సమాచారం మేరకు అశ్వాపురం సీఐ ఎల్లయ్య తన సిబ్బందితో తనిఖీలు చేస్తుండగా ఈ క్రింది అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు.

1. పోడియం అనిల్ కుమార్, సర్వాయిపాడు బంజారా గ్రామం
2. కురుసం రాంబాబు, సర్వాయిపాడు బంజారా గ్రామం
3. బోళ్ల నరసయ్య, అశ్వాపురం
4. కారం నరేష్, కొత్త సూరారం
5. కుంట శ్రీను, అశ్వాపురం
6. తడకమళ్ల ప్రసాద్, అశ్వాపురం

వారిని విచారించగా, సర్వాయిపాడు బంజారా గ్రామ శివారులో గల రాజీవ్ సాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన పెద్ద ఇనుప పైపును గ్యాస్ కట్టర్ సహాయంతో కట్ చేసి, దాని విడిభాగాలను దొంగతనంగా తరలిస్తున్నట్లు ఒప్పుకున్నారు.తదనంతరం వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ అనంతరం రిమాండ్ నిమిత్తం మణుగూరు కోర్టులో హాజరపరిచి రిమాండ్ కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

# ఓబీసీ సింహగర్జన విజయవంతం





**పోరు తెలంగాణ పత్రిక న్యూస్ ప్రతినిధి శేర్లింగంపల్లి నియోజకవర్గం అక్టోబర్ 05 :** శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో భారీగా తరలి వెళ్లిన బీసీ సంఘాల నేతలు. ఓబీసీ సింహగర్జనను విజయవంతం చేసిన బీసీ సంఘాల నాయకులకు ధన్యవాదాలు తెలిపిన బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు భేరి రామచందర్ యాదవ్.హైదరాబాద్ ఓబీసీ సింహగర్జన' మహాసభ పీసీసీ ఓబీసీ ఛైర్మన్, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓబీసీ సింహగర్జన విజయవంతం అయ్యింది. శేరిలింగంపల్లి నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తరలి వెళ్ళి ఓబీసీ సింహగర్జనను విజయవంతం చేసిన ప్రతి బీసీ సంఘాల నాయకులకు ధన్యవాదాలు తెలిపిన బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు భేరి రామచందర్ యాదవ్. మన దేశంలో సామాజిక సమతుల్యతను, బహుజనుల హక్కులను కాపాడటమే లక్ష్యంగా అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన పిలుపు మేరకు, రంగారెడ్డి జిల్లా, శంషాబాద్ మండలం గొల్లపల్లిలో ప్రతిష్టాత్మకంగా 'ఓబీసీ సింహగర్జన' మహాసభ పీసీసీ ఓబీసీ ఛైర్మన్, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా భేరి రామచందర్ యాదవ్ మాట్లాడుతూ ఓబీసీల హక్కుల కోసం, రాజ్యాంగబద్ధమైన పదవులలో తగిన రిజర్వేషన్ల సాధన కోసం, "జిస్కి జిత్ని సంఖ్య – ఉత్ని హిస్సేదారి" (ఎవరి సంఖ్య ఎంతైతే, అంత వాటా) అనే నినాదాన్ని సాకారం చేసేందుకు ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం అవ్వడం సంతోషంగా ఉందన్నారు. సామాజిక న్యాయం మన కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతం, ఓబీసీ సోదరులు, యువకులు, మహిళలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అందరూ భారీ సంఖ్యలో తరలివచ్చి, శంషాబాద్ గడ్డపై జరగిన ఈ 'ఓబీసీ సింహగర్జన' సభ ను ఘన విజయం చేసిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఓబీసీ హక్కుల కోసం ఐక్యతను చాటి పెద్ద ఎత్తున తరలివచ్చి సింహ గర్జన సభను విజయవంతం చేసిన వారందరికీ నమస్కారాలు తెలియజేసిన భేరి రామచందర్ యాదవ్. పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో బీసీ ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని అన్నారు. బీసీలంతా ఏకమై పోరాటం చేద్దాం అని అన్నారు. పోరాడితే పోయేది బానిస సంకెళ్లు మన ఓబిసి హక్కులకై మన అందరం కలిసికట్టుగా ఐక్యమత్యంగా పోరాటం చేసి మన హక్కులు మనం సాధించుకోవాలని అన్నారు. సభకు ఏఐసీసీ ఓబీసీ ఛైర్మన్ డా అనిల్ జైహింద్ యాదవ్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐపీసీ చైర్మన్ మధు యాస్కీ గౌడ్, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంత్ రావు, యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ మారబోయిన రఘునాథ్ యాదవ్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి నవీన్ యాదవ్, ఏఐసీసీ ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ కోఆర్డినేటర్ కొప్పుల రాజు, తెలంగాణ రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర రాష్ట్ర, జిల్లా స్థాయి ప్రముఖ నాయకులు, మేదరి సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షులు కుంటూ నవీన్, అందెల కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపల్లి గ్రామపంచాయతీ లో కాక వెంకట స్వామి జయంతి



**పోరు తెలంగాణ,మంచిర్యాల జిల్లా అక్టోబర్ 5 :** భీమారం మండలం కొత్తపల్లి గ్రామపంచాయతీలో సర్పంచ్ దుర్గం తిరుపతి ఆధ్వర్యంలో దివంగత నేత, మాజీ కేంద్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వెంకటస్వామి కాక జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దుర్గం తిరుపతి కాకా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కాకా వెంకటస్వామి చేసిన సేవలు,కార్మికులకు అందించిన సేవలు,బడుగుబలహీన వర్గాలకు అందించిన సేవలు,పెన్షన్ స్కీ కోసం ఆయన చేసిన కృషి ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దుర్గం తిరుపతి, పాలకవర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి వసుంధర, ఎఫ్ ఎ కిష్టయ్య, బోగే రవీందర్,కావేరి ఆనంద్,గ్రామపంచాయతీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి

నేడు జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయండి..

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి..



**మహేశ్వరం, అక్టోబర్ 5, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** ఓట్ చోరీకి పాల్పడుతున్న సీఈసీ జ్ఞానేష్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని టీపీసీసీ సభ్యుడు, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు సంరక్షణ కోసం కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం తదితర వామపక్షాలు ఐక్యంగా పోరాడాలని డీసీసీ అధ్యక్షురాలు పారిజాత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని ఇండియా కూటమి పిలుపు మేరకు అక్టోబర్ 2 నుంచి 8 వరకు నిర్వహిస్తున్న సేవ్ డెమోక్రసీ మార్చ్‌కు సంఘీభావం తెలియజేయడం జరిగిందని అన్నారు. నేడు ఉదయం 10 గంటలకు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కొంగర కలాన్ నిరసన కార్యక్రమంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఓటర్ల జాబితా, సర్ ప్రక్రియపై ప్రతిపక్షాలు లేవనెత్తుతున్న అభ్యంతరాలకు ఎన్నికల సంఘం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని కోరారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాదని, ప్రతి అర్హుడి ఓటు హక్కును కాపాడాలని చెప్పారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం ఉండేలా పారదర్శకత, జవాబుదారీతనం అవసరం అని అన్నారు.ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఇన్‌చార్జ్ పామేన భీమ్ భరత్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి,జిల్లా కార్యదర్శి యాదయ్య, సీపీఎం నాయకుడు సామేల్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ సిరిగాని సాయి, కాంగ్రెస్ సీపీఐ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

## గడ్డం వెంకటస్వామి (కాకా) 97వ జయంతి వేడుకలు

గుండేటి ఐలయ్య ఆధ్వర్యంలో



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి ఓదెల, అక్టోబర్ 5:** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం కృషి చేసిన మహానేత, మాజీ కేంద్ర మంత్రి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి స్వర్గీయ జి. వెంకటస్వామి (కాకా) 97వ జయంతి వేడుకలు సోమవారం పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి కాంగ్రెస్ పార్టీ నాయకులు, పెద్దపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్య యాదవ్ ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం వెంకటస్వామి (కాకా) చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. జీవితాంతం పేదలు, బడుగు బలహీన వర్గాల కోసం కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాసరపు ఐలయ్య గౌడ్, జంగం కొమురయ్య, చిందం నందనం, రాజయ్య, మల్లేశం, నరసయ్య, మల్లయ్య తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓదెలలో గడ్డం వెంకటస్వామి జయంతి వేడుకలు



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** ఓదెల మండల తహశీల్దార్ కార్యాలయం లో సోమవారం పెద్దపల్లి మాజీ ఎంపీ గడ్డం వెంకట్ స్వామి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలవేసి జయంతి నివాళులర్పించారు ఈ కార్యక్రమములో రెవెన్యూ ఇన్స్పెక్టర్ గౌతమ్ , జూనియర్ అసిస్టెంట్ సాయి, పలు గ్రామాల జి పి ఓ లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యంతో మిషన్ భగీరథ మంచినీరు వృథాగా పోతున్న వైనం



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** ఓదెల మల్లికార్జున స్వామి ఆలయ సమీపంలో ఈరవేన సదయ్య వ్యవసాయ బాయి సమీపంలో గత వారం రోజుల క్రితం పైపులైను పగిలి వృథాగా పోతున్న నీరు పట్టించుకోని అధికారులు . ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు చేపట్టిన మిషన్ భగీరథ పథకం అధికారుల నిర్లక్ష్యానికి గురవుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామంలోని ప్రధాన పైపులైన్ పగిలిపోవడంతో భారీగా తాగునీరు వృథాగా పోతున్నా వైనం సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైపులైన్ నుంచి నీరు సమీప పొలాలలోకి ప్రవహిస్తూ విలువైన తాగునీరు వృథా అవుతోంది. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా మరమ్మతులు చేపట్టకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు పైపులైన్ లీకేజీతో నీరు వృథా అవుతుండటం అధికారుల పర్యవేక్షణ తీరుపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పగిలిన పైపులైన్‌కు వెంటనే మరమ్మతులు చేపట్టి తాగునీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# బీసీ నాయకులపై దాడులు సరికాదు

ఓదెల మాజీ జడ్పీటీసీ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గంట రాములు యాదవ్



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** పెద్దపల్లి పట్టణంలోని ఆర్ఆర్ గార్డెన్స్‌లో జరిగిన బీఆర్ఎస్ బీసీ సమావేశం సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలపై ఓదెల మాజీ జడ్పీటీసీ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గంట రాములు యాదవ్ తీవ్రంగా స్పందించారు. ఆర్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.బీసీ నాయకులు, కార్యకర్తలను సమావేశాలకు ఆహ్వానించకుండా ఏకపక్షంగా కార్యక్రమాలు నిర్వహించడం సరికాదని గంట రాములు అన్నారు. బీసీలకు జరుగుతున్న అన్యాయాలు, స్థానిక సమస్యలపై ప్రశ్నించినందుకే తమ వర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలపై దాడులు జరిగాయని ఆయన ఆరోపించారు.బీఆర్ఎస్ పేరుతో అల్లరి మూకలు దాడులకు పాల్పడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. రాజకీయ విభేదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని, దాడులకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ ఘటనకు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి మనోహర్ రెడ్డి నైతిక బాధ్యత వహించాలని గంట రాములు కోరారు. అదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలతో పాటు రైతులు, బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఎన్ని అడ్డంకులు ఎదురైనా ప్రజా సమస్యలపై ప్రశ్నించే తన గొంతు ఆగదని గంట రాములు యాదవ్ అన్నారు. బీసీల హక్కుల కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.

# జైపూర్ మండలంలో ముఖ్య ప్రణాళిక అధికారి పర్యటన



**పోరు తెలంగాణ మంచిర్యాల, అక్టోబర్ 5 :** జైపూర్ మండలం ఇందారం, శెట్పల్లి గ్రామపంచాయతీలను ముఖ్య ప్రణాళిక అధికారి, మంచిర్యాల , రాజు కుమార్ ఏపిఎం పెన్షన్ విభాగం, బండారి రాజేందర్ ప్రణాళిక అధికారి, పర్యటించారు. గ్రామంలో ఇటీవల చేయూత పింఛన్ (వితంతువు, వికలాంగులు, ఒంటరి మహిళ, గీత కార్మిక,బీడీ కార్మిక, డయాలసిస్) కి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులని క్షేత్ర స్థాయి లో విచారణ చేపట్టారు . ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీపతి బాపూరావు, పంచాయతీ కార్యదర్శి లు ప్రశాంత్, ప్రతిభారాణి, రజిత గ్రామస్తులు దరఖాస్తుదారులు పాల్గొనడం జరిగింది.

# డబుల్ బెడ్‌రూం ఇళ్ల ఎంపికపై సమగ్ర విచారణ జరపాలి




**కొత్తగూడెం ఆర్సీ/పాల్వంచ, అక్టోబర్ 05(పోరు తెలంగాణ ప్రతినిధి,జీవిరత్నం):** పాల్వంచలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు ఆరోపించారు. అర్హులైన నిరుపేదలను పక్కనబెట్టి సొంత ఇళ్లు ఉన్నవారికి ఇళ్లు కేటాయించారని విమర్శించారు. లబ్ధిదారుల ఎంపికపై రీ-వెరిఫికేషన్ చేపట్టి సమగ్ర విచారణ జరపాలని జిల్లా కలెక్టర్‌ను డిమాండ్ చేశారు. పాల్వంచ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారుల ఎంపిక చేయడంపై అనేక సందేహాలు ఉన్నాయని అన్నారు. గతంలో అధికారులు హామీ ఇచ్చిన ప్రాంతంలోని దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోకుండా 360 మందిని ఎంపిక చేయడం సరికాదన్నారు. ఎంపికలో అక్రమాలకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, అవసరమైతే వాటిని బయటపెడతామని తెలిపారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు పూర్తికాకముందే లబ్ధిదారుల ఎంపిక చేయడంపై కూడా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. కొన్ని ఇళ్ల నిర్మాణాలు నాసిరకంగా ఉన్నాయని ఆరోపిస్తూ, నిర్మాణ నాణ్యతపై కూడా విచారణ జరపాలని కోరారు. కలెక్టర్ తక్షణమే సమగ్ర విచారణ చేపట్టి నిజమైన నిరుపేదలకు ఇళ్లు కేటాయించకపోతే సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో భారీ ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు దొడ్డ రవికుమార్, తులసీరామ్, సత్యవాణి, ఎస్.కె. నిరంజన్, సులోచన, వింజరాములు, బి.కాంతి తదితరులు పాల్గొన్నారు.

# పండుగకు కూడా పస్తులేనా స్కావెంజర్ల జీవితాలు

కందిక చెన్నకేశవులు
ఏఐటీయూసీ వరంగల్ జిల్లా అధ్యక్షులు




**పోరు తెలంగాణ నెక్కొండ అక్టోబర్ 5 :** ఏఐటీయూసీ వరంగల్ జిల్లా స్కావెంజర్ల సమావేశం గొర్రె విజయ అధ్యక్షతన వరంగల్ శివనగర్ తమ్మెర భవన్లో నిర్వహించడం జరిగింది ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ వరంగల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కందిక చెన్నకేశవులు గన్నారపు రమేష్ లు ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ గత ఐదు నెలలుగా పెండింగులో ఉన్న స్కావెంజర్ల వేతనాలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వ గుర్తింపు పొందేందుకు రిజిస్టర్లో వారి పేరు నమోదు చేసుకొని సంతకాలు తీసుకోవాలని కనీస వేతనం 26000 అమలు చేయాలని వారికి నెలకు రెండు ప్రభుత్వ సెలవులు ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది తెలంగాణలో అతిపెద్ద పండుగ దసరా కూడా పస్తులు ఉండే పరిస్థితి వచ్చిందని తక్షణమే వారి వేతనాలను విడుదల చేసి స్కావెంజర్లకు చేయితనందియాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం అయినది ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గుండె బద్రి దామెర కృష్ణ స్కావెంజర్ల జిల్లా కార్యదర్శి రాయరాకుల కోమల జెర్రిపోతుల విజయ మేరీ ఎండి యాకూబీ నిర్మల రామారావు సదిరం అరుణ సునిత సదిరం రజిత బేబీ సవిత మొగులాభి కొత్తగట్టు రజిత గ్యార మంగమ్మ గంగమ్మ అరుణ మమత శిరీష జెర్రిపోతుల రాధా తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

# జిల్లా కేంద్రంలో జరిగే మార్చ్ ఫాస్ట్ జయప్రదం చేయండి అఖిలపక్షం నిర్ణయం



**బూర్గంపాడు అక్టోబర్ 5 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** సోమవారం నాడు బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో కాంగ్రెస్ పార్టీతో కలిసి అఖిలపక్ష నాయకులు సిపిఐ,సిపిఎం, టిడిపి అఖిలపక్షనేతలు పాల్గొని సర్ ప్రక్రియలో జరిగేటువంటి తప్పులను ఎత్తిచూపుతూ నిజమైన ఓటర్లను ఓటర్ జాబితా నుంచి తొలగించడం పట్ల వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు షెడ్యూల్ తెగలు, షెడ్యూల్ కులాలు,మైనార్టీలను తొలగించే ప్రక్రియలో భాగంగా మోడీ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ఎత్తిచూపారు ఓటర్ల జాబితా నుండి నిజమైన ఓటర్లను తొలగించడం అనేది శరీరం నుండి ఆత్మను వేరు చేయటమేనని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని పలువురువ్యాఖ్యానించారు. భారతఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని, అమితాషా,మోడీని గద్దె దిగాలని డిమాండ్ చేశారు దీనికి నిరసనగా ఈనెల 8వ తారీకు కొత్తగూడెం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీతో పాటు అఖిలపక్షంతో జరిగేటువంటి మార్చ్ ఫాస్ట్ జయప్రదం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో బూర్గంపహాడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పూలపెల్లి సుధాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి వారాల వేణు, సిపిఐ మండల కార్యదర్శి సబ్బ నాగేశ్వరరావు సిపిఐ జిల్లా సమితి సభ్యులు పేరాల శ్రీనివాసరావు సిపిఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు, , తెలుగుదేశం పార్టీ ప్రతినిధి కాకర్ల సత్యనారాయణ, దిశా కమిటీ డైరెక్టర్ బానోత్ మురళి కృష్ణ, అంజనాపురం సర్పంచ్ బానోతు నరసింహ, కృష్ణ సాగర్ సర్పంచి తాటి వాణి, పినపాక పట్టి నగర్ సర్పంచ్ బానోతు పద్మ,బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుబెల్లంకొండ వాసుదేవరావు, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకుడు పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కేసుపాక రాజేష్, సిపిఎం కమిటీ సభ్యులు పాపినేని సరోజ, ఆభిద, రాయల వెంకటేశ్వర్లు, నియోజకవర్గ ఎస్సీ సెల్ ఇంచార్జి కొట్టి అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు

# అణగారిన వర్గాల అభ్యున్నతి కృషి చేసిన మహనీయుడు గడ్డం వెంకటస్వామి (కాకా)డి.సి.పి. ఎ.భాస్కర్





**పోరు తెలంగాణ, మంచిర్యాల అక్టోబర్ 5, 2026 :** కార్మికులు, పేదలు, అణగారిన వర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేసిన కార్మిక పక్షపాతి, సామాజిక సేవకుడు గడ్డం వెంకటస్వామి (కాకా) అని డి.సి.పి. ఎ.భాస్కర్ అన్నారు. సోమవారం గడ్డం వెంకటస్వామి (కాకా) జయంతిని పురస్కరించుకొని జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకలకు జిల్లా షెడ్యూల్ కులముల అభివృద్ధి అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా కార్మిక శాఖ అధికారి క్రాంతి, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి హాజరై గడ్డం వెంకటస్వామి (కాకా) చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డి.సి.పి. మాట్లాడుతూ గడ్డం వెంకటస్వామి (కాకా) కార్మిక పక్షపాతిగా, దేశ ప్రగతికి కార్మికులే పునాది అనే బలమైన విశ్వాసంతో పనిచేసిన గొప్ప వ్యక్తి అని తెలిపారు. కార్మికులకు కేవలం వేతనాలు మాత్రమే కాకుండా "డిగ్నిటీ ఆఫ్ లేబర్" గౌరవం లభించాలనే భావనతో జీవితాంతం కృషి చేశారని తెలిపారు. సమాజంలోని అసమానతలను రూపుమాపేందుకు విశేషంగా కృషి చేశారని, ప్రతి మనిషి మనుగడకు ఆహారం, దుస్తులు, నివాసం అత్యంత ముఖ్యమైనవని గుర్తించి, పేదలు, గుడిసెల్లో నివసించే ప్రజల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. జాతీయ గుడిసెల సంఘం ద్వారా గుడిసెలలో జీవిస్తున్న పేద ప్రజలకు నివాస సౌకర్యం కల్పించేందుకు కృషి చేశారని, దాదాపు 30 కాలనీలలో ఇళ్ల ఏర్పాటుకు చేసిన కృషి పేద ప్రజల జీవితాలలో గణనీయమైన మార్పును తీసుకువచ్చిందని తెలిపారు. కుల, మత భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ అండగా నిలిచి, సామాజిక న్యాయం కోసం గడ్డం వెంకటస్వామి (కాకా) పోరాడారని, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అడుగుజాడలలో నడుస్తూ, ఆశయాల సాధనే లక్ష్యంగా పని చేశారని తెలిపారు. ప్రతి ఒక్కరికీ విద్య అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు, పేదలు, అణగారిన వర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేశారని తెలిపారు. దేశంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, కాకా వెంకటస్వామి పేర్లు సార్వజనీన సంక్షేమం కోసం చేసిన సేవలకు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని తెలిపారు. గడ్డం వెంకటస్వామి (కాకా) వారసులు ప్రస్తుత కాలంలో పెద్ద సంఖ్యలో కార్మికులు ఉపాధి పొందుతున్న గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం కొత్త చట్టం తీసుకురావడంలో కృషి చేశారని తెలిపారు. కార్మికులు, పేదలు, అణగారిన వర్గాల సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం ద్వారా గడ్డం వెంకటస్వామి (కాకా) ఆశయాలను కొనసాగిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పాల్వంచ అభివృద్ధికి కేటీపీఎస్ 8వ దశే కీలకం!

2x800 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టుకు జాప్యం లేకుండా అనుమతులు ఇవ్వాలి

యువతకు ఉపాధి.. పరిశ్రమలకు పునరుజ్జీవనం..

పాల్వంచకు అభివృద్ధి







**కొత్తగూడెం ఆర్సీ/పాల్వంచ, అక్టోబర్ 05(పోరు తెలంగాణ ప్రతినిధి,జీవిరత్నం):** ఐదు దశాబ్దాలుగా విద్యుత్, పారిశ్రామిక రంగానికి కేంద్రంగా నిలిచిన పాల్వంచ భవిష్యత్ అభివృద్ధికి కేటీపీఎస్ 8వ దశ అత్యంత కీలకమని అఖిలపక్ష నాయకులు పేర్కొన్నారు. ప్రతిపాదిత 2x800 మెగావాట్ల (1,600 మెగావాట్లు) సూపర్‌క్రిటికల్ విద్యుత్ ప్రాజెక్టుకు అవసరమైన అన్ని అనుమతులను త్వరితగతిన పూర్తి చేసి నిర్మాణ పనులు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేటీపీఎస్ కాలనీలోని ఇంజనీర్స్ అసోసియేషన్ హాల్‌లో సోమవారం జమ్ముల సీతారామరెడ్డి అధ్యక్షతన కేటీపీఎస్ 8వ దశ సాధన సమితి అఖిలపక్ష సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 8వ దశ సాధన కోసం అఖిలపక్ష కమిటీని ఏర్పాటు చేసి, దశలవారీ ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. పలు పరిశ్రమలు మూతపడటం, పాత విద్యుత్ యూనిట్లు తొలగిపోవడంతో పాల్వంచలో ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయని నాయకులు పేర్కొన్నారు. 8వ దశ ప్రాజెక్టు ప్రారంభమైతే వేలాది కుటుంబాలకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభించడంతోపాటు నిర్మాణ, రవాణా, హోటల్, చిన్న వ్యాపారాలు, సేవా రంగాలకు భారీగా ఊతం లభిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో భవిష్యత్ విద్యుత్ అవసరాలు భారీగా పెరగనున్న నేపథ్యంలో ముందస్తు ప్రణాళికతో ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. భారీ విద్యుత్ ప్రాజెక్టులకు ఐదారు సంవత్సరాల సమయం పట్టే అవకాశం ఉన్నందున అనుమతుల విషయంలో జాప్యం చేయరాదని, ప్రభుత్వం, టీజీజెన్‌కో యాజమాన్యం తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగా అధికారులను, మంత్రులను కలిసి వినతిపత్రాలు సమర్పించడం, స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయడం, కరపత్రాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించడం, రిలే నిరాహార దీక్షలు, దశలవారీ ఆందోళనలు, అవసరమైతే పాల్వంచ బంద్‌కు పిలుపునివ్వాలని సమావేశం నిర్ణయించింది. "కేటీపీఎస్ 8వ దశ సాధన.. పాల్వంచ భవిష్యత్ అభివృద్ధికి ఉద్యమం" అనే లక్ష్యంతో అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక, ప్రజా, వ్యాపార, పారిశ్రామిక సంఘాలు ఐక్యంగా ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డీఈ మంగీలాల్, డిప్యూటీ మేయర్ లలితకుమారి, ఎడవల్లి కృష్ణ, మచ్చ శ్రీనివాసరావు, కొత్వాల శ్రీనివాసరావు, కిలారు నాగేశ్వరరావు, జలసూత్రం శివరాం ప్రసాద్, కాల్వ భాస్కరరావు, బత్తుల మధుచంద్, నూకల రంగారావు, పాతూరు చంద్రశేఖర్‌రెడ్డి, కొండపల్లి శ్రీధర్, కాల్వ ప్రకాష్‌రావు, కాపర్తి వెంకటాచారి, ఆవుల కృష్ణారెడ్డి, హనుమంతరావు, వివిధ పార్టీల ప్రతినిధులు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# పొత్తుల పోరు ప్రగతి చక్రం బేజారు

ఆర్టీసీ యూనియన్ ఎన్నికల్లో
హోరాహోరీ సమరం..
కార్మికులను మచ్చిక చేసుకునేందుకు
నేతల ముమ్మర ప్రయత్నాలు..
అధికార ప్రతిపక్ష పార్టీల
అండదండలపై జోరుగా చర్చలు..
గెలుపుపై ఎవరి ధీమా వారిదే..
ఫలితాలపై ఆసక్తికర అంచనాలు..






**మహేశ్వరం అక్టోబర్ 5, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** ఆర్టీసీ యూనియన్ ఎన్నికల సమయం దగ్గరపడుతున్న కొద్దీ రోజురోజుకు కార్మిక సంఘాల మధ్య పోరు రసవత్తరంగా మారుతోంది. ఒకవైపు కార్మికుల సమస్యలే ప్రధాన ఎజెండాగా ప్రచారం సాగుతుండగా.. మరోవైపు రాజకీయ పార్టీల అండదండలతో బరిలోకి దిగుతున్న సంఘాలు విజయమే లక్ష్యంగా పావులు కదుపుతున్నాయి. దీంతో ఆర్టీసీ ప్రగతి చక్రం చుట్టూ యూనియన్ రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ఇప్పటికే వివిధ సంఘాల నేతలు డిపోల వారీగా కార్మికులను కలుస్తూ తమకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు.

**చాపకింద నీరులా మంతనాలు..**

ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో యూనియన్ నేతలు చాపకింద నీరులా ప్రచారం ముమ్మరం చేస్తున్నారు. డిపోల్లో కార్మికులతో సమావేశాలు నిర్వహిస్తూ వారి సమస్యలను తెలుసుకుంటున్నారు. వేతనాలు, బదిలీలు, పదోన్నతులు, ఉద్యోగ భద్రత, పని ఒత్తిడి, విధి నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులు వంటి అంశాలను ప్రధానంగా ప్రస్తావిస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. గతంలో తమ సంఘం చేసిన పోరాటాలు, సాధించిన ప్రయోజనాలను వివరిస్తూ కార్మికులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.

**పొత్తులపై ఉత్కంఠ..**

ఎన్నికల నేపథ్యంలో వివిధ సంఘాల మధ్య పొత్తుల అంశం కూడా ఆసక్తికరంగా మారింది. కొన్ని సంఘాలు పరస్పరం అవగాహనకు వచ్చే ప్రయత్నాలు చేస్తుండగా.. మరికొన్ని సంఘాలు ఒంటరిగానే బరిలోకి దిగేందుకు సిద్ధమవుతున్నాయి. ఏ సంఘంతో ఎవరు జతకడతారు? ఎవరికి ఎవరూ మద్దతు ఇస్తారు? అనే అంశంపై కార్మికుల్లో తీవ్రంగా చర్చ సాగుతోంది. చివరి నిమిషంలో పొత్తులు కుదిరే అవకాశాలపై కూడా అంచనాలు వినిపిస్తున్నాయి.

**రాజకీయ అండదండలపై చర్చ..**

ఆర్టీసీ యూనియన్ ఎన్నికలకు రాజకీయ రంగు కూడా అద్దుకుంటోందన్న చర్చ కార్మిక వర్గాల్లో వినిపిస్తోంది. అధికార పార్టీకి అనుకూలంగా ఉండే సంఘానికి కార్మికులు మొగ్గు చూపుతారా? లేక రాజకీయాలకు అతీతంగా కార్మికుల సమస్యలపై పోరాడే సంఘానికే పట్టం కడతారా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతల మద్దతు కోసం కొన్ని యూనియన్లు ప్రయత్నిస్తున్నాయన్న ప్రచారం కూడా జరుగుతోంది.

**ఎవరిధీమా వారిదే..**

ఎన్నికల బరిలో ఉన్న ప్రతి సంఘం గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తోంది. తమ వైపే మెజార్టీ కార్మికులు ఉన్నారని కొందరు నేతలు చెబుతుండగా.. గతంలో తమ సంఘం చేసిన పోరాటాలే విజయానికి దోహదపడతాయని మరికొందరు నేతలు పేర్కొంటున్నారు. డిపోల వారీగా కార్మికుల మద్దతును అంచనా వేస్తూ నేతలు వ్యూహాలు రూపొందిస్తున్నారు. ప్రత్యర్థి సంఘాల బలాబలాలను విశ్లేషిస్తూ ప్రచారాన్ని మరింత వేగవంతం చేస్తున్నారు. ఈ ఎన్నికలలో కార్మికులు రాష్ట్రానికి ఒక ఓటు, రీజనల్ లెవెల్ లో ఒక ఓటు వేయడం జరుగుతుందని ఆర్టీసీ కార్మికులు అంటున్నారు.

**కార్మికుల తీర్పే కీలకం..**

ఆర్టీసీ యూనియన్ ఎన్నికల్లో చివరకు కార్మికులు ఎవరికి పట్టం కడతారన్నదే కీలకం. రాజకీయ అండదండలు ఉన్న సంఘానికా? లేక తమ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడే కార్మిక సంఘానికా? అన్నది తేలాల్సి ఉంది. నాయకుల హామీలు, పొత్తులు, రాజకీయ మద్దతు కంటే తమ సమస్యలను ఎవరు సమర్థవంతంగా పరిష్కరించగలరన్న అంశానికే కార్మికులు ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా అధికార కాంగ్రెస్ పార్టీ ఆర్టీసీ ఎన్నికలలో ఎలాగైనా గెలవాలని లక్ష్యంతో పావులు కలుపుతున్నారు.మొత్తంగా ఆర్టీసీ యూనియన్ ఎన్నికల పోరు రోజురోజుకూ రసవత్తరంగా మారుతుండగా.. ప్రగతి చక్రాన్ని నడిపించే కార్మికులు తమ ఓటుతో ఎవరికి పట్టం కడతారో ఈ నెల 9న వేచి చూడాల్సిందే.

**బాణం గుర్తు గెలిస్తే కార్మికులకు తగిన న్యాయం..**

ఈనెల 9న జరిగే ఆర్టీసీ ఎన్నికలలో బాణం గుర్తు గెలిస్తే మహేశ్వరం ఆర్టీసీ డిపో కార్మికులకు న్యాయం చేకూరుతుంది. గతంలో ఉన్న ప్రభుత్వాలు కార్మికులను పట్టించుకోలేదు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడానికి కృషి చేస్తా. ప్రజా పాలనలో సీఎం రేవంత్ రెడ్డి అన్ని వర్గాలకు, అన్ని పక్షాలకు, కార్మికులకు, కర్షకులకు పెద్దపీట వేస్తున్నారు. మహేశ్వరం ఆర్టీసీ డిపోను సమస్యలు లేని డిపోగా తీర్చిదిద్దుతాం.. నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్..

# గుడిసెల వెంకటస్వామికాకా 97వ.జయంతివేడుకలుఘనంగాచెన్నూర్: ఐఎఫ్‌టీయూ డివిజన్‌లి నాయకుల.ఆధ్వర్యంలో ఫోటో కు పూల మాలలు వేసి ఘనంగా జయంతి వేడుకలు జరిపారు

**పోరుతెలంగాణ ప్రతినిధి చెన్నూరు:** ప్రజా నేత, కార్మిక బాంధవుడు, తెలంగాణ తేజం స్వర్గీయ గడ్డం వెంకటస్వామి కాకా 97వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి కాకా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన సేవలను స్మరించుకున్నారు ఈ కార్యక్రమంలో తెలంగాణ మోటార్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ అనుబంధం) నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ నాయకులు రమేష్ మాసాని మాట్లాడుతూ.. పేదలు, కార్మికుల సంక్షేమం కోసం గడ్డం వెంకటస్వామి కాకా చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. పేదలకు సొంత గూడు కల్పించేందుకు ఆయన చేసిన పోరాటం చరిత్రలో నిలిచిపోయిందన్నారు. మంత్రి వివేక్ వెంకటస్వామి పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇళ్లు అందించేందుకు కృషి చేస్తున్నారని, అయితే ఇప్పటికీ ఇళ్లు లేని నిరుపేదలు, పలుమార్లు దరఖాస్తులు చేసుకున్నప్పటికీ ఇళ్లు మంజూరు కాని అర్హులు ఉన్నారని తెలిపారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి వివేక్ వెంకటస్వామిని కోరారు. కాక వెంకటస్వామి ప్రజల కోసం పోరాడి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని, అదే విధంగా ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ మంత్రి వివేక్ వెంకటస్వామి కూడా ప్రజల మనసుల్లో మంచి పేరు సంపాదించుకోవాలని జయంతి సందర్భంగా రమేష్ మాసాని కోరారు.

**పేదల కోసం 'గుడిసెల వెంకటస్వామి'గా గుర్తింపు**

గడ్డం వెంకటస్వామిని ప్రజలు ప్రేమగా 'కాకా' అని పిలుచుకునేవారు. పేదలు, కార్మికుల కోసం ఆయన చేసిన పోరాటాల కారణంగా లి'గుడిసెల వెంకటస్వామి'లిగా కూడా ఆయనకు ప్రత్యేక గుర్తింపు వచ్చింది. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ తదితర ప్రాంతాల్లో గుడిసెల్లో నివసిస్తున్న పేదలకు శాశ్వత గృహవసతి కల్పించేందుకు ఆయన పెద్ద ఎత్తున పోరాటాలు చేశారు. నేషనల్ హట్స్ యూనియన్ నాయకుడిగా పేదల గృహ సమస్యపై పోరాడి వేలాది కుటుంబాలకు ఇళ్లను సాధించడంలో కీలక పాత్ర పోషించారు. పేదలు, కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపిన ఆయన పోరాట స్ఫూర్తి నేటి




తరానికి ఆదర్శమని నాయకులు పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమాల్లోనూ వెంకటస్వామి కాకా కీలక పాత్ర పోషించారని, తెలంగాణ ప్రాంత హక్కుల కోసం ఆయన నిరంతరం గళమెత్తారని నాయకులు గుర్తుచేశారు. ఈ జయంతి వేడుకల్లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పుట్ట కృష్ణమాచారి, కుందారపు అశోక్, బొజ్జ గోపి తదితరులు పాల్గొన్నారు.

# మట్టి కింద సమాధవుతున్న నిజాలు వెన్నవల్లిలో పచ్చని గుట్టల విధ్వంసం!

మట్టి మాఫియా దాహానికి జేసీబీ డ్రైవర్ బలి

వందల కోట్ల అక్రమ వ్యాపారం నిద్రమత్తులో అధికారులు

పర్యావరణం, అటవీ శాఖల అనుమతులు ఏవి?

ధ్వంసమవుతున్న రోడ్లు, కనుమరుగవుతున్న వన్యప్రాణులు

భయం గుప్పిట్లో నోరు మెదపలేని దౌర్భాగ్య స్థితిలో గ్రామాలు

**పోరు తెలంగాణ సత్తుపల్లి (ప్రతినిధి):-** అభివృద్ధి ముసుగులో ప్రకృతిని విలువెత్తున దోచేస్తున్న మట్టి మాఫియా పైశాచికత్వానికి నిండు ప్రాణం బలైంది. ఖమ్మం జిల్లా కల్లూరు మండలం వెన్నవల్లి గ్రామ సమీపంలో అక్రమంగా గుట్టను తవ్వుతుండగా చరియలు విరిగిపడి ఓ జేసీబీ డ్రైవర్ దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన కేవలం ఒక ప్రమాదం కాదు.. వందల కోట్ల రూపాయల కక్కుర్తి కోసం మట్టి మాఫియా చేసిన ముమ్మాటికీ ముందస్తు హత్యే. ఒకవైపు పచ్చని గుట్టలు నేలమట్టం అవుతున్నా, మరోవైపు వన్యప్రాణులు ప్రాణాలు కోల్పోతున్నా సంబంధిత మైనింగ్, అటవీ శాఖ అధికారులు చోద్యం చూస్తుండటం పలు అనుమానాలకు తావిస్తోంది.

**వందల కోట్ల దోపిడీ.. పర్మిషన్లు ఎవరిచ్చారు?**

వెన్నవల్లి గుట్టల సాక్షిగా ప్రతిరోజూ వందల ట్రిప్పుల మట్టి అక్రమంగా తరలిపోతోంది. ఇదంతా ఎవరి కనుసన్నల్లో జరుగుతోంది? మైనింగ్, ఫారెస్ట్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, వన్యప్రాణుల చట్టాలు, ఎన్విరాన్మెంట్ బోర్డుల నుంచి కనీస అనుమతులు లేకుండానే ఇంత పెద్ద ఎత్తున తవ్వకాలు ఎలా సాగిస్తున్నారు? అధికారుల కనుసన్నల్లో, వారి జేబులు నిండుతుండటం వల్లే ఈ విధ్వంసం నిరాటంకంగా సాగుతోందన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.







**వన్యప్రాణులు ఏమయ్యాయి? స్మగ్లర్ల పాలయ్యాయా?**

ఒకప్పుడు ఆ గుట్టల మీద స్వేచ్ఛగా తిరిగిన వన్యప్రాణులు ఏమయ్యాయి? జేసీబీల మోతలకు భయపడి సురక్షిత ప్రాంతాలకు వలస వెళ్లాయా? లేక మట్టి మాఫియాతో పాటు చేతులు కలిపిన స్మగ్లర్ల ఉచ్చులో పడి ప్రాణాలు విడిచాయా? పర్యావరణాన్ని నాశనం చేస్తూ, జంతువుల ఆవాసాలను తుడిచిపెడుతున్నా అటవీశాఖ అధికారులు ఎందుకు గురకపెట్టి నిద్రపోతున్నారు?

**ప్రాణాలే కాదు.. నిజాలూ సమాధేనా?**

గుట్ట చరియలు విరిగిపడి ఒక నిర్భాగ్యుడైన జేసీబీ డ్రైవర్ మృతి చెందితే, ఆ శవాన్ని హడావుడిగా బయటకు తీసిన పెద్దలు.. ఈ ఘటన వెనుక ఉన్న "నిజాలను" మాత్రం అదే మట్టి కింద పాతిపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. కూలీల శవాలు దొరుకుతున్నాయి కానీ, ఈ అక్రమ వ్యాపారం వెనుక ఉన్న అసలు నిజాలు దొరకనివ్వరా? డబ్బుల కట్టలతో చట్టం కళ్లకు గంతలు కడుతున్నారా?

**పాత్రధారులు ఎవరు? సూత్రధారులు ఎవరు?**

ఈ మట్టి దందా వెనుక ఉన్న సూత్రధారులు ఎవరు అనేది స్థానికంగా అందరికీ తెలిసిన బహిరంగ సత్యమే. కానీ, భయం గుప్పిట్లో బతుకుతున్న ప్రజలు నోరు విప్పి మాట్లాడలేని దౌర్భాగ్య స్థితి నెలకొంది. వేలాది భారీ వాహనాల రాకపోకలతో గ్రామీణ రోడ్లు ఛిద్రమవుతున్నాయి. గాలిలోకి లేస్తున్న దుమ్ము, ధూళితో చుట్టుపక్కల వందలాది ఎకరాల్లో పంట పొలాలు నాశనమవుతున్నాయి. ప్రజల ఇళ్లు మట్టి కొట్టుకుపోతున్నాయి. ఇంత జరుగుతున్నా చూస్తూ ఊరుకోవడమేనా? ప్రకృతిని నాశనం చేస్తూ, అమాయకుల ప్రాణాలు తీస్తున్న ఈ మట్టి మాఫియాపై తక్షణమే ఉన్నతాధికారులు స్పందించాలి. పర్యావరణాన్ని కాపాడే బాధ్యత తీసుకుని, డ్రైవర్ మృతిపై సమగ్ర విచారణ జరిపి, ఈ విధ్వంసకాండ వెనుక ఉన్న సూత్రధారులను కటకటాల వెనక్కి నెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేనిపక్షంలో, రేపు ప్రకృతి చేసే ప్రళయ తాండవానికి మొత్తం గ్రామాలే మట్టిలో కలిసిపోయే ప్రమాదం ఉంది.

## బిల్లుల కోసం ఉప సర్పంచ్ కమిషన్ అడుగుతున్నారని కాంట్రాక్టర్ ఆరోపణ

పనులు పూర్తి చేసి నిరాశతో ఎదురుచూస్తున్న కాంట్రాక్టర్ మండోకర్ అనిల్....



**పోరు తెలంగాణ అక్టోబర్ 05 కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి** : కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి గ్రామపంచాయతీలో తాను చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను ఉప సర్పంచ్ చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్నారని కాంట్రాక్టర్ మండోకర్ అనిల్ ఆరోపించారు. పనులు నిబంధనల ప్రకారం పూర్తి చేసి అధికారులకు అప్పగించినా, చెక్కుపై సంతకం చేయకుండా జాప్యం చేస్తున్నారని ఆయన తెలిపారు. పనుల పత్రాలు, కొలతలు, బిల్లులు పంచాయతీ అధికారుల వద్దే ఉన్నాయన్నారు. ప్రధాన ఆరోపణలు బిల్లులు చెల్లించాలంటే కమిషన్ ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారు అంగీకరించకపోవడంతోనే సంతకం ఆపుతున్నారు.ఈ సమస్యపై వార్తలు రాసిన విలేకరులపై కూడా ఒత్తిళ్లు తెస్తున్నారు.అప్పులు చేసి పనులు పూర్తిచేశానని, బిల్లులు నెలల తరబడి ఆగిపోవడంతో వడ్డీల భారంతో ఆర్థికంగా నష్టపోతున్నానని అనిల్ వాపోయారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా శాశ్వత పరిష్కారం దక్కలేదన్నారు. డిమాండ్లు ఈ ఆరోపణలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి, నిజమని తేలితే ఉప సర్పంచ్‌ను సస్పెండ్ చేయాలని కోరారు. గతంలో వచ్చిన ఆరోపణలనూ రికార్డుల ఆధారంగా పరిశీలించాలని, విలేకరులపై ఒత్తిడి నిజమైతే సంబంధితులపై చర్య తీసుకోవాలని అన్నారు. తన పనుల్లో లోపాలున్నాయని భావిస్తే అధికారికంగా తనిఖీ చేసుకోవచ్చని, విచారణ లేకుండా బిల్లులు ఆపడం సరికాదని పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై ఉప సర్పంచ్, పంచాయతీ అధికారుల వివరణ ఇంకా తెలియాల్సి ఉంది.

## వాంకిడి బుద్ధ విహార్ లో కాకా వెంకటస్వామి 97వ జయంతి



**పోరు తెలంగాణ అక్టోబర్ 05: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో దళిత నాయకుడు, మాజీ కేంద్ర మంత్రి కాకా వెంకటస్వామి 97వ జయంతిని సోమవారం (అక్టోబర్ 5) ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం సందీప్, భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అశోక్ మాహుల్కర్ మాట్లాడుతూ, వెంకటస్వామి మూడుసార్లు ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ఎమ్మెల్యేగా, ఏడుసార్లు లోక్‌సభకు ఎంపీగా ఎన్నికయ్యారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మూడుసార్లు కేంద్ర మంత్రిగా పనిచేశారని, ఏఐసీసీ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా కూడా సేవలందించారని తెలిపారు. సింగరేణి కార్మికుల సంక్షేమానికి కృషి చేశారని, దేశవ్యాప్తంగా కార్మికులకు ప్రావిడెంట్ ఫండ్ పెన్షన్ పథకం రూపకల్పన, అమలులో కీలక పాత్ర పోషించారని వక్తలు కొనియాడారు. కులం, మతం, పార్టీలకు అతీతంగా కష్టాల్లో ఉన్నవారిని ఆదుకున్నారని, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి జీవితాన్ని అంకితం చేసిన జననేతగా తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు.

## తెలంగాణ కోసం చదువును త్యాగం చేసిన ఉద్యమకారుడు ఈదునూరి రమేష్ ఆదుకోవాలని మద్దతుదారుల విజ్ఞప్తి



**పోరు తెలంగాణ నెక్కొండ , అక్టోబర్ :** తెలంగాణ మలిదశ ఉద్యమ సమయంలో తన చదువును, బంగారు భవిష్యత్తును పణంగా పెట్టి ఉద్యమంలో కీలకంగా పాల్గొన్న ఉద్యమకారుడు ఈదునూరి రమేష్ ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం తగిన న్యాయం చేయాలని ఆయన అనుచరులు, తోటి ఉద్యమకారులు డిమాండ్ చేస్తున్నారు. ఉద్యమ సమయంలో పార్టీ కోసం, తెలంగాణ సాధన కోసం అహర్నిశలు కృషి చేసిన రమేష్, తన వ్యక్తిగత జీవితాన్ని, చదువును పూర్తిగా ఉద్యమానికే అంకితం చేశారు. ఉద్యమం సఫలమై తెలంగాణ సాధించుకున్నా, తన జీవితాన్ని త్యాగం చేసిన రమేష్ లాంటి క్షేత్రస్థాయి కార్యకర్తలకు ఇంకా తగిన గుర్తింపు దక్కలేదని వాపోతున్నారు. మాజీ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అభిమానులు సైతం రమేష్ చేసిన సేవలను కొనియాడుతూ, ఆయన పరిస్థితిని ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు ఈ ప్రకటనలో తెలిపారు. ఈ అంశంపై సంబంధిత వర్గాల స్పందనను కూడా ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు. తెలంగాణ సమాజం ప్రశ్నిస్తోంది: ఉద్యమంలో కీలకంగా పాల్గొన్న వ్యక్తులకు తగిన గుర్తింపు, సహాయం అందుతుందా? ఈదునూరి రమేష్ కు న్యాయం చేయాలని ఆయన మద్దతుదారులు కోరుతున్నారు. రమేష్ కు తగిన గుర్తింపు, సహాయం అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

## అర్హులైన 146 మంది లబ్ధిదారులకు రూ.49.21 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన మంత్రి అడ్లూరి



**పోరు తెలంగాణ ధర్మపురి, అక్టోబర్ 5 :** ధర్మపురి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ముఖ్యమంత్రి సహాయనిధి (జవీ=ఖీ) చెక్కుల పంపిణీ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని అర్హులైన 146 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.49,21,400 విలువైన జవీ=ఖీ చెక్కులను మంత్రి లక్ష్మణ్ కుమార్ పంపిణీ చేశారు. ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో అండగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సహాయ కార్యక్రమాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## పాల్వంచలో పోలీసుల ప్రత్యేక తనిఖీలు

నేరాల నియంత్రణకు కఠిన చర్యలు అనుమానితులపై నిఘా




**కొత్తగూడెం ఆర్సీ/పాల్వంచ, అక్టోబర్ 05(పోరు తెలంగాణ ప్రతినిధి,జివిరత్నం):** పాల్వంచ పట్టణ పరిధిలో నేరాల నియంత్రణ, ప్రజల భద్రతకు సంబంధించి పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. అక్టోబర్ 5న నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా డీటీఎఫ్ బృందంతో పాటు సీఐ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పట్టణంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించినట్లు ప్రెస్ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, నేరాలకు సంబంధం ఉన్న ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు సమాచారం. గతంలో నమోదైన కేసులు, దొంగతనాల నేపథ్యంలోనూ పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, నేరాలకు అడ్డుకట్ట వేసే లక్ష్యంతో నిరంతరం తనిఖీలు కొనసాగిస్తామని పోలీసులు పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

## గంజాయి సాగుదారులపై ఆసిఫాబాద్ పోలీసుల ఉక్కుపాదం



**పోరు తెలంగాణ అక్టోబర్ 05: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా పోలీసులు కఠిన చర్యలు చేపడుతున్నారని ఎస్పీ నితికా పంత్ తెలిపారు. ఆసిఫాబాద్ డీఎస్పీ బి. అశోక్ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా లింగాపూర్, సిర్పూర్ (యు), కెరమెరి పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 6 కేసులు నమోదు చేసి, సుమారు రూ.50 లక్షల విలువైన 500 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ సాగుకు పాల్పడిన ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గణాంకాలు 2025లో 39 కేసులు, 35 మంది అరెస్టు, రూ.1.13 కోట్ల విలువైన 1,134 మొక్కలు స్వాధీనం. 2026లో ఇప్పటివరకు సాగుపై 23 కేసులు, 27 మంది అరెస్టు, రూ.2.36 కోట్ల విలువైన 2,366 మొక్కలు స్వాధీనం డ్రై గంజాయి (2026).32 కేసులు, 68 మంది అరెస్టు, సుమారు రూ.3 లక్షల విలువైన 10 కిలోలు స్వాధీనం. సంక్షేమ పథకాల నిలిపివేత గంజాయి సాగుకు పాల్పడిన 20 మంది భూ యజమానులకు కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని నిలిపివేశారు. ప్రస్తుత కేసుల్లోని నిందితుల భూ యజమానుల వివరాలను తహసీల్దార్ల ద్వారా సేకరించి కలెక్టర్‌కు పంపుతామని, అర్హత మేరకు వారికీ ఇదే చర్య వర్తిస్తుందని ఎస్పీ చెప్పారు. గంజాయి వల్ల యువత, విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుందని, అందుకే చట్టపరమైన చర్యలతో పాటు లబ్ధి నిలిపివేత కూడా కొనసాగుతుందని ఎస్పీ హెచ్చరించారు. గంజాయి సాగు, రవాణా, విక్రయాల సమాచారం తెలిసినవారు వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. తనిఖీల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బందిని ఆమె అభినందించారు.

## వినతికి స్పందన.. హైదరాబాద్ బస్సు పునరుద్ధరణ




**పోరు తెలంగాణ నెక్కొండ అక్టోబర్ 5 :** కొద్దిరోజులుగా నిలిచిపోయిన మానుకోట--హైదరాబాద్ ఆర్టీసీ బస్సు సేవలు తిరిగి ప్రారంభమయ్యాయి. బస్సు లేక ఆయా గ్రామాల నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన పెద్దకోరుపోలు మాజీ ఎంపీటీసీ భర్త, బీజేపీ జిల్లా నాయకుడు అంబాల రామ్‌గోపాల్ ఆర్టీసీ ఆర్ఎం, డీఎంలకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టారు. సోమవారం నుంచి బస్సు రాకపోకలను పునరుద్ధరించారు. మానుకోట నుంచి కేశముద్రం, వెంకటగిరి, పెద్దకోరుపోలు, మడిపల్లి, గుండ్రపల్లి మీదుగా నెక్కొండకు చేరుకుని హైదరాబాద్ వెళ్లే ఈ బస్సు ఆయా గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రామ్‌గోపాల్ తెలిపారు. ఉదయం సుమారు 6 గంటలకు నెక్కొండ--పెద్దకోరుపోలు ప్రాంతానికి బస్సు వస్తుందని, తిరిగి సాయంత్రం 5--6 గంటల మధ్య అదే మార్గంలో ప్రయాణిస్తుందని చెప్పారు. బస్సు సజావుగా నడిచేందుకు గ్రామాల ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, యువజన సంఘాలు రహదారులపై అడ్డంగా పెరిగిన ముళ్లపొదలను తొలగించడం విశేషం. సమస్య పరిష్కారానికి సమన్వయంతో పనిచేయడంతో బస్సు సేవలు పునరుద్ధరించడంపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

## రోడ్లను పట్టించుకోని అధికారులు

ప్రమాదాల అంచున ప్రజల ప్రయాణం





**పోరు తెలంగాణ అక్టోబర్ 05 : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం ఈస్‌గాం గ్రామంలో ప్రధాన రహదారుల పరిస్థితి రోజురోజుకూ దారుణంగా మారుతోంది. రోడ్లు పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలు కురిసిన సమయంలో గుంతల్లో నీరు చేరడంతో రహదారి ఎక్కడుందో, గుంత ఎక్కడుందో తెలియని పరిస్థితి నెలకొంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారిపై నిత్యం రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, ఇతర వాహనదారులు ప్రమాదాల భయంతో ప్రయాణించాల్సి వస్తోందని చెబుతున్నారు. రోడ్ల దుస్థితి కారణంగా వాహనాలు దెబ్బతినడంతో పాటు అత్యవసర సమయాల్లో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని పేర్కొంటున్నారు. ప్రజల ఇబ్బందులు కళ్లకు కనిపిస్తున్నా అధికారులు ఎందుకు స్పందించడం లేదనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రధాన రహదారులకు తక్షణ మరమ్మతులు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించిన తర్వాత స్పందించకుండా, ముందుగానే రోడ్లను పునరుద్ధరించి ప్రజలకు సురక్షిత రాకపోకలు కల్పించాలని కోరుతున్నారు.